RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 | సంచిక : 35 | బుధవారం 13.5. 2026 | ఎడిటర్ : జేరిపోతుల సంపత్ | పేజీలు :8 | వెల: 2.00

తెలంగాణ వాణి

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించవగలరు.

9182328292

## బీసీలను మోదీ మోసం చేస్తున్నారు.. వీహెచ్ ఫైర్



హైదరాబాద్ తెలంగాణ వాణి)

: బీసీల లెక్క తీయకపోతే తమకు న్యాయం జరగదని, బీసీలను మోదీ మోసం చేస్తున్నారని ప్రభుత్వ సలహాదారు వి.హన్మంతరావు విమర్శించారు. బీసీలపై మోదీకి చిత్తశుద్ధి లేదని, అంబానీ, అదానీలకు మాత్రమే మోదీ సహాయం చేస్తారని విమర్శించారు. సోమవారం ఆయన గాంధీభవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ మేం అడుక్కునే వాళ్ళలాగా కనిపిస్తున్నామా? మోదీలో ఇప్పటికైనా మార్పు రావాలని ఆయన హితవు పలికారు. బీసీల పట్ల రేవంత్ రెడ్డికి ఉన్న చిత్తశుద్ధి మోదీకి లేదు తెలంగాణలో బీజేపీ ఎలా అధికారంలోకి వస్తుందో చూస్తామని వీహెచ్ సవాల్ విసిరారు. బీసీ కులగణన చేయమని మోదీకి పవన్ కళ్యాణ్ చెప్పాలన్నారు. ఓబీసీ కాలం లేకపోతే జనగణనలో బీసీలు పాల్గొనకండి అని వీహెచ్ పిలుపు ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీపై మోదీ దుర్మార్గమైన వాఖ్యలు చేశారని, కాంగ్రెస్ పార్టీని ముస్లిం, మావోవాది పార్టీ అనడం తప్పు అని వీహెచ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ముస్లింలు మనుషులు కాదా? ముస్లింలు దేశ స్వతంత్ర పోరాటంలో పాల్గొన్నారన్నారు. మోదీ దేశాన్ని ముక్కలు చేయాలని చూస్తున్నారని, ఆయన ఆర్ఎస్సెస్ ఏం చెప్తే అది చేస్తారని ఆరోపించారు.

## తెలంగాణకు 16 టీఎంసీలు.. ఏపీకి 10 టీఎంసీలు




హైదరాబాద్ తెలంగాణ వాణి)

కృష్ణా జలాల కేటాయింపులపై రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న వివాదాల నడుమ కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) త్రిసభ్య కమిటీ సమావేశమైంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల తాగునీటి అవసరాలపై సమాలోచనలు జరిపింది. ప్రస్తుత జలాశయాల్లో ఉన్న నిల్వలు, రెండు రాష్ట్రాల అవసరాలు, ఇప్పటికే జరిగిన వినియోగం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నీటి కేటాయింపులు ఖరారు చేసింది. మిగిలిన వేసవి కాలానికి సంబంధించి నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నుంచి తాగునీటి విడుదలపై ప్రధానంగా చర్చించారు. తెలంగాణకు నాగార్జునసాగర్ నుంచి 16 టీఎంసీలు, శ్రీశైలం నుంచి 5 టీఎంసీలు కలిపి మొత్తం 21 టీఎంసీల నీటిని కేటాయించగా.. ఏపీకి సాగర్ నుంచి 10 టీఎంసీల నీటిని విడుదల చేయాలని నిర్ణయించింది. ఈ కేటాయింపులు ఆగస్టు 15 వరకు అమల్లో ఉంటాయని తెలిపింది.

## తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సిందే..

హైదరాబాద్ తెలంగాణ వాణి)

తన కుమారుడు బండి భగీరథ్ పై నమోదైన పోక్సో కేసుపై కేంద్రమంత్రి బండి సంజయ్ స్పందించారు. తాను ఏ దారిలో వెళుతున్నానో అదే దారిలో తన భార్య కూడా వస్తోందన్నారు. తన దగ్గర కంటే తన భార్య దగ్గరకే కార్యకర్తలు ఎక్కువగా వెళ్తారని చెప్పారు. ఈరోజు తన భార్య డిప్రేషన్ లోకి వెళ్లిందని.. తల్లడిల్లిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమారుడు ఏ తప్పు చేయలేదని చెప్పాడన్నారు. కానీ తన కుమారుడిని క్రిమినల్‌లా చూపే ప్రయత్నం చేస్తున్నారంటూ ఎమోషనల్ అయ్యారు. తప్పు చేస్తే ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు. తప్పు ఎవరు చేసినా సమర్ధించేదిలేదని చట్టం ముందు అందరూ సమానులేనని స్పష్టం చేశారు. తన కుటుంబంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నన్ను కెలికారు.. నా కుటుంబాన్ని ఇబ్బంది పెట్టినవాళ్లను వదిలిపెట్టేది లేదని సంజయ్ హెచ్చరించారు. మీరు పెట్టిన నిప్పు మీకే అంటుకుంటుందని వార్నింగ్ ఇచ్చారు. సమాజమే తన కుటుంబం అని భావించానని తన కుటుంబంపై రాళ్లు వేస్తున్నారని అన్నారు. తప్పు చేస్తే ఎవరి కుమారుడైనా వదిలిపెట్టనని అన్నారు. కుట్రలు, కుతంత్రాలతో తన కుటుంబాన్ని బజారున పడేశారని, వారిని విడిచిపెట్టనని హెచ్చరించారు. ఆంజనేయ స్వామి లంకా దహనం చేసినట్లు మీరు పెట్టిన ఈ నిప్పుతో దళారుల వ్యవస్థ, కుటుంబ వ్యవస్థ, అవినీతి వ్యవస్థను దగ్ధం చేస్తానని అన్నారు. శ్రీరామచంద్రుడికే అరణ్యవాసం తప్పలేదని వ్యాఖ్యానించారు. తన గుండె మీద కాషాయం జెండా ఉందని, తన తల మీద అమ్మవారి ఆశీస్సులు ఉన్నాయని చెప్పారు.

# ధాన్యం సేకరణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

### రబీ, మొక్కజొన్న కొనుగోలు, వరి ధాన్యం సేకరణపై సీఎం సమీక్ష..



హైదరాబాద్ తెలంగాణ వాణి)

ధాన్యం, మొక్కజొన్న పంట కొనుగోళ్ల పై నిర్లక్ష్యం వహిస్తే అధికారుల పై వెంటనే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను హెచ్చరించారు. మంగళవారం మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్ల పై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, దనసరి అనసూయ (సీతక్క), అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కరీంనగర్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాలో ఉన్న ప్రతి ప్రైవేట్ గోదామును అవసరమైతే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని, అవసరమైన అన్ని చట్టాలను వినియోగించి నిల్వ సదుపాయాలను పెంచాలని సూచించారు. కమ్యూనిటీ హాళ్లు, రైతు బజార్లను తాత్కాలిక షెడ్లుగా వినియోగించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీలు, ఉన్నత స్థాయి పోలీసు అధికారులు కొనుగోలు ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని, అవసరమైన వాహనాల ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. జిల్లాల్లో స్థానిక హమాలీలను 100 శాతం వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందించాలని, ఎక్కడా హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన పోలీసు సహకారం తీసుకోవాలని స్పష్టం చేశారు. కొన్ని చోట్ల ధాన్యం రైస్ మిల్లులకు చేరిన తర్వాత రైతులకు రశీదులు ఇస్తుండటంతో కోతలు జరుగుతున్నాయని, ఇది ఎట్టి పరిస్థితుల్లోనూ జరగకూడదని సీఎం స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన అనంతరం రైతులకు వెంటనే రశీదులు ఇవ్వాలని, రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కోతలు ఉండకూడదని ఆదేశించారు.

పంట రవాణా కోసం ఖాళీగా ఉన్న అన్ని వాహనాలు, ట్రాక్టర్లు, డీసీఎంలను పూర్తిస్థాయిలో వినియోగించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. తడిసిన ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి రైస్ మిల్లుకు కొనుగోళ్ల పర్యవేక్షణ కోసం సమర్థవంతమైన అధికారిని నియమించాలని, ఆయా అధికారులు ప్రతి రోజూ నివేదికలు పంపించాలని సీఎం ఆదేశించారు. కొనుగోళ్ల వ్యవహారంపై జిల్లా కలెక్టర్లు పూర్తి బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు మిషన్ మోడ్‌లో పని చేయాలని, క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పత్రికల్లో వచ్చే ప్రతికూల వార్తలకు జిల్లా కలెక్టర్లు వెంటనే స్పందించి పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. ప్రతిరోజు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి కొనుగోళ్ల పురోగతిని సమీక్షించాలని సూచించారు. కొనుగోళ్ల అంశాన్ని తేలికగా తీసుకునే అధికారుల పై వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిరోజూ వివిధ సమస్యలపై రైతులు రోడ్డెక్కే పరిస్థితి రాకూడదని, రవాణా కోసం నిబంధనల ప్రకారం వాహనాలు ఇవ్వని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.ౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ యాసంగి సీజన్‌లో తెలంగాణ ప్రభుత్వం రికార్డు స్థాయిలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని మాత్రమే నిర్దేశించిందన్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 25 లక్షల 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల వద్ద 11 లక్షల 52 వేల టన్నుల ధాన్యం పెండింగ్‌లో ఉందన్నారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపుల కోసం ఇప్పటివరకు రూ. 3,873 కోట్లను బ్యాంకుల ద్వారా విడుదల చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 18 కోట్ల 68 లక్షల గన్నీ సంచులను అందుబాటులో ఉంచామని, ఎటువంటి కొరత లేదని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు హమాలీలు, రవాణా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే ఫీడ్‌బ్యాక్ అందేలా వ్యవస్థ ఉండాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లు పూర్తి బాధ్యత తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్నీ సంచులు, హమాలీలు, రవాణా వాహనాల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## మహిళా వారోత్సవాలను విజయవంతం చేయాలి

**మహిళల సాధికారతను ప్రతిబింబించేలా కార్యక్రమాలు నిర్వహించాలి**

**బీఆర్ఎస్ నిలిపివేసిన వడ్డిలేని రుణాలు కొనసాగింపు**

**సమర్థవంతంగా లోన్ భీమా పథకాలు**



హైదరాబాద్ తెలంగాణ వాణి)

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 25 నుంచి 31 వరకు నిర్వహించనున్న మహిళా వారోత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ సీతక్క అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు భిన్న రంగాల్లో మహిళలు సాధిస్తున్న విజయాలను చాటి చెప్పే విధంగా షెడ్యూల్ రూపొందించాలన్నారు. కనీసం 4 వేల గ్రామాల్లో మహిళా భవనాల నిర్మాణానికి శంకు స్థాపన జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సచివాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖలపై మంత్రి సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళా సంఘ సభ్యుల విజయగాథలను ప్రజల ముందుకు తీసుకు రావాలని సూచించారు. సీఎం చేతుల మీదుగా మహిళా సాధికారత, మహిళా విజయాల ఆవిష్కరణ ఉంటుందన్నారు.

**బీఆర్ఎస్ నిలిపివేసిన వడ్డిలేని రుణాలు కొనసాగింపు**

ఐదేళ్లలో రూ.1 లక్ష కోట్ల క్రెడిట్ లింకేజ్ లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. గత రెండేళ్లలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కలిపి రూ.60,487 కోట్ల బ్యాంకు లింకేజ్ సాధించడం ద్వారా మహిళల ఆర్థిక భాగస్వామ్యం గణనీయంగా పెరిగిందన్నారు. బీఆర్ఎస్ హయంలో నిలిచిపోయిన వడ్డీ లేని రుణాల పథకాన్ని తిరిగి ప్రారంభించామని తెలిపారు. .

**సమర్థవంతంగా లోన్ భీమా పథకాలు**

మహిళా సంఘ సభ్యులకు భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోన్ భీమా, ప్రమాద భీమా పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని మంత్రి తెలిపారు. సభ్యురాలి మరణం సంభవించినప్పుడు రూ. 2 లక్షల వరకు రుణ భీమా రక్షణ అందిస్తున్నామని, ఇప్పటివరకు 2,993 క్లెయిమ్‌లకు రూ.23.72 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. ప్రమాద మరణాలపై రూ.10 లక్షల భీమా అందించే ప్రమాద భీమా పథకం కింద 228 క్లెయిమ్‌లకు రూ.22.28 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. జిల్లా సమాఖ్యల కోసం రూ.110 కోట్లతో 22 ఇందిరా మహిళా శక్తి భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు.

## నీట్ రద్దు కేంద్రానికే సిగ్గుచేటు.. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దు



హైదరాబాద్ తెలంగాణ వాణి)

నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ప్రకటన విడుదల చేశారు. 'నీట్ ప్రశ్నాపత్రం లీకై ఏకంగా పరీక్షనే రద్దుచేయాల్సిన దుస్థితి రావడం కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటు. పగలూ రాత్రి కష్టపడి చదివిన ఎంతోమంది విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటమాడింది. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించడం చేతకాని ఎన్డీఏ ప్రభుత్వ వైఫల్యం వల్లే మరోసారి పేపర్ లీకైంది. 2024 లోనూ నీట్ ప్రశ్నాపత్రం లీకైన ఉదంతం నుంచి గుణపాఠం నేర్చుకోకపోవడం వల్లే మళ్లీ ఈ ఘటన పునరావృతమైంది. జాతీయ అర్హత పరీక్ష నిర్వహణలో వరుసగా వెలుగుచూస్తున్న ఈ అసమర్థత విద్యార్థుల పట్ల శాపంగా మారింది. ఏకంగా వందకు పైగా ప్రశ్నలు పరీక్షకు ముందు రోజే లీక్ కావడం వ్యవస్థలో ఉన్న దారుణమైన లోపాలను బయటపెట్టింది. దేశవ్యాప్తంగా ఈ ఏడాది నీట్ పరీక్ష రాసిన దాదాపు 23 లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కేంద్ర సర్కారు తీవ్ర మానసిక క్షోభకు గురిచేసింది. ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకుని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించాలి. దీని వెనక ఎంత పెద్దవాళ్ల హస్తం ఉన్నా, వాళ్లందరినీ పట్టుకుని కఠినంగా శిక్షించాలి, వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలి. అలాగే సాధ్యమైనంత త్వరగా మళ్లీ నీట్ పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి. నీట్ పేపర్ లీకేజీకి పూర్తి బాధ్యత వహించి కేంద్ర ప్రభుత్వం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు క్షమాపణలు చెప్పాలి' అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## ఈనెలాఖరుకు ఎస్ఐఆర్ మ్యాపింగ్ 90శాతం పూర్తి

హైదరాబాద్ తెలంగాణ వాణి)

ఈనెలాఖరు నాటికి ఎస్ఐఆర్ మ్యాపింగ్ 90శాతం పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లను సీఈఓ సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌లోని సీఈఓ కార్యాలయం నుండి తెలంగాణలోని డీఈఓలు, ఈఆర్ఓలతో 'ప్రత్యేక ముమ్మర సవరణ' (ఎస్ఐఆర్)పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని మరియు ఈ నెలాఖరుకు 90 శాతం పురోగతిని సాధించాలని కలెక్టర్లు, డీఈఓలను ఆదేశించారు. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) త్వరలో ప్రత్యేక ముమ్మర సవరణను ప్రకటించనుందని తెలిపారు. మ్యాపింగ్ ప్రక్రియలో వివిధ నివాస సంఘాలు మరియు గేటెడ్ కమ్యూనిటీలను భాగస్వాములను చేయాలని సీఈఓ కోరారు. ప్రభుత్వ అధికారులందరూ సంబంధిత బీఎల్ఓలను సంప్రదించి స్వచ్ఛందంగా మ్యాపింగ్ చేసుకోవాలని




సూచించారు. ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లు, బీఎల్ఓలు గేటెడ్ కమ్యూనిటీలు మరియు మురికివాడలను సందర్శించి, అక్కడి ప్రతినిధుల సహకారంతో మ్యాపింగ్ నిర్వహించాలన్నారు. ఓటర్లకు మ్యాపింగ్ కోసం సహాయం చేయడానికి 'హెల్ప్ డెస్క్'లను ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను కోరారు.

## ఆరోగ్యశాఖలో దాదాపు 13 వేల పోస్టులను భర్తీ చేశాం: మంత్రి దామోదర్ రాజనర్సింహ

గత రెండున్నరేళ్లలో ఆరోగ్యశాఖలో దాదాపు 13 వేల పోస్టులను భర్తీ చేసినట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. మంగళవారం కోటిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ఆరోగ్యశాఖలో ఉద్యోగాలు పొందిన 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించిన నర్సింగ్ ఆఫీసర్లకు, వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం రోజునే నియామక పత్రాలు అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇదే గ్రౌండ్‌లో ఇప్పటికే 1,257 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు నియామక పత్రాలు అందజేసినట్లు మంత్రి రాజనర్సింహ గుర్తుచేసుకున్నారు. ఇక్కడే 623 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్‌లకు, 132 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు నియామక పత్రాలు అందించామని తెలిపారు. గతంలో 6956 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేశామని... రెండున్నర సంవత్సరాల్లో 9 వేల నర్సింగ్ పోస్టులను భర్తీ చేసిన ఘనత మన ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. దాదాపు మరో 5 వేల పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఇందులో సుమారు 2 వేల ఏఎన్ఎం పోస్టుల ఫలితాలు మరో ఒకటి, రెండు రోజుల్లో ప్రకటిస్తామని అన్నారు. న్యాయపరమైన కారణాలతో ఆలస్యమైన 732 ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీని కూడా త్వరలో పూర్తి చేస్తామని వెల్లడించారు. ప్రతి ప్రభుత్వ హాస్పిటల్ పూర్తిస్థాయిలో సిబ్బందితో పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దేశీయ, అంతర్జాతీయ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని నర్సింగ్ విద్యను విస్తరిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ రెండేళ్లలో కొత్తగా 16 ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేశామని... అందులో 960 బీఎస్సీ నర్సింగ్ సీట్లను అందుబాటులోకి తీసుకొచ్చామని అన్నారు. విద్యానంతరం విదేశాల్లో ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన స్కిల్స్‌ను ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ విద్యార్థులకు నేర్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, మీర్జా రహ్మత్ బేగ్, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



**నాగర్ కర్నూల్, మే 12 (తెలంగాణ వాణి)**
నాగర్ కర్నూల్ నియోజకవర్గంలోని పెద్దూరు, తెల్కపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో కొనసాగుతున్న కొనుగోలు ప్రక్రియపై అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్ మొక్కజొన్న తేమ శాతం, తూకం విధానం, నిల్వ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. కొనుగోలు చేసిన మొక్కజొన్నను గోదాముల్లో సక్రమంగా నిల్వ చేయాలని సూచన మద్దతు ధర ప్రకారం రైతులకు సకాలంలో చెల్లింపులు జరగాలని కలెక్టర్ ఆదేశాలు కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న హేమంత్ కేశవ్ పాటిల్ రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆపరేటివ్ అధికారి రఘునాథ్ రావు, కోఆపరేటివ్ అధికారులు పాల్గొన్నారు

# విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ అభినందన సభ

**జిల్లాలోనే ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి 50వేలు నగదు ప్రోత్సాహాన్ని అందచేసిన భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి**




**కుత్బుల్లాపూర్ మే 12 (తెలంగాణ వాణి)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్, భౌరంపేట్ లోని ప్రభుత్వ పాటశాలలో , భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఆధ్వర్యంలో 10వ తరగతి లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా లొనే మొదటి స్థానం సంపాదించిన విద్యార్థికి , ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు , అభినందన సభ నిర్వహించడం జరిగింది. ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించి తమ తల్లిదండ్రులకు, పాఠశాలలకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకువచ్చిన విద్యార్థులను మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, శాలువాతో సన్మానించి, నగదు పురస్కారాన్ని అందచేసారు. ముఖ్యంగా భౌరంపేట్‌కు చెందిన ఒక విద్యార్థి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించడం పట్ల కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థి లక్ష్మీ నారాయణకు రూ.50,000 నగదు పురస్కారం అందజేశారు. మండల స్థాయిలో 3వ ర్యాంక్ సాధించిన విద్యార్థికి రూ.30,000 నగదు బహుమతిని ప్రదానం చేశారు. అదేవిధంగా 500 పైగా మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున, 490 పైగా మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున నగదు పురస్కారాలను అందజేసి వారి ప్రతిభను కొనియాడారు.అనంతరం వారు మాట్లాడుతూ, విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. జిల్లా స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించడం భౌరంపేట్ ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు.

# మాదకద్రవ్యాల వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

**కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. ఈశ్వరయ్య**




**వనపర్తి , మే 12, (తెలంగాణ వాణి ప్రతినిధి)**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా విద్యా వారోత్సవాల సందర్భంగా వనపర్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం యోగా, ధ్యానం మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. ఈశ్వరయ్య అధ్యక్షత వహించారు. వైస్ ప్రిన్సిపాల్ ఈ. రామరాజు యాదవ్ మాట్లాడుతూ విద్యార్థినులు ఒత్తిడిని జయించేందుకు యోగా, ధ్యానం అలవర్చుకోవాలని, మాదకద్రవ్యాల వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.అధ్యాపకులు దామోదర్ రెడ్డి, స్వామి, విష్ణుమూర్తి, జగదీశ్వరయ్య, డాక్టర్ పోతరాజు శ్రీనివాస్, విజయలక్ష్మి, పుష్ప, మంజుల, శ్రావంతి, కే శ్రీనివాసులు యువరూప లక్ష్మి, మణిదీప, గోవర్ధన్, మన్నెమ్మ తదితరులు విద్యార్థినులకు పలు యోగాసనాలు వేయించి, వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. మాదక ద్రవ్యాలు యువత జీవితాలను నాశనం చేస్తాయని, సమాజానికి చేటు చేస్తాయని అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా విద్యార్థినులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది అందరూ కలిసి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. బి. ఈశ్వరయ్య, వైస్ ప్రిన్సిపాల్ ఈ. రామరాజు యాదవ్, అధ్యాపకులు దామోదర్ రెడ్డి, స్వామి, విష్ణుమూర్తి, జగదీశ్వరయ్య, డాక్టర్ పోతురాజు శ్రీనివాస్, విజయలక్ష్మి, పుష్ప, మంజుల, శ్రావంతి, యువరూప లక్ష్మి, మణిదీప, గోవర్ధన్, మన్నెమ్మతో పాటు బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థినులు పాల్గొన్నారు.

# మహోన్నత వ్యక్తిత్వం గల మహా నాయకుడు తుమ్మల

- **తుమ్మలతో జర్నలిస్టుల అనుబంధం మరువలేనిది**
- **సీనియర్ జర్నలిస్ట్ మోటమర్రి రామకృష్ణ**



**కొత్తగూడెం (తెలంగాణ వాణి)**
ఉమ్మడి ఖమ్మం జిల్లాను విశేషంగా అభివృద్ధి చేసిన మహోన్నత వ్యక్తిత్వం గల మహా నాయకుడు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో జర్నలిస్టుల అనుబంధం మరువలేనిదని సీనియర్ జర్నలిస్ట్ మోటమర్రి రామకృష్ణ స్పష్టం చేశారు. 1984 నుంచి ఖమ్మం జిల్లా కేంద్రంలో పనిచేసిన జర్నలిస్టులందరికీ తుమ్మల నాగేశ్వరరావు సుపరిచితులని, ఆయనకు జర్నలిస్టుల పట్ల ఎంతో గౌరవభావం ఉండేదని తెలిపారు.1985 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అప్పటి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎన్టీ రామారావు సత్తుపల్లి వచ్చి ప్రజాసేవ చేయాలనే సంకల్పం గల విద్యావంతుడైన యువకుడిని తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఎంపిక చేశానని, ప్రజలు తప్పనిసరిగా గెలిపించాలని కోరుతూ తుమ్మల నాగేశ్వరరావును నియోజవర్గ ప్రజలకు పరిచయం చేశారన్నారు. ఆ సన్నివేశం ఎప్పటికీ మరువలేనిదని తెలిపారు. అప్పటి నుంచి ఆయన తనకు బాగా తెలుసునని ఆ మధుర జ్ఞాపకాలను రామకృష్ణ నెమరువేసుకున్నారు. ప్రజా సేవే పరమావధిగా రాజకీయాలలో ప్రవేశించి, ఉన్నత శిఖరాలను అధిరోహించి, ప్రజల సంక్షేమానికి, జిల్లా అభివృద్ధికి పథకాలను కార్యక్రమాలను చేపట్టిన తుమ్మల అభినందనీయుడని ప్రశంసించారు.1986 నుంచి నేటి వరకు నాలుగు సార్లు రాష్ట్ర మంత్రిగా బాధ్యతలను స్వీకరించి ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలను చేపట్టి ప్రజల హృదయాలలో చెరగని ముద్రవేశారని ఆయన కొనియాడారు. నిజాయితీకి ప్రతిరూపంగా తుమ్మల ప్రజలలో పేరు పొందారని, అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలతో నాలుగు దశాబ్దాల పాటు ప్రజలకు విశేష సేవలు అందించారని, ఎన్నో విజయాలను సాధించిన ఆయన రాజకీయ ప్రస్థానం అందరికీ స్ఫూర్తిదాయకమని స్పష్టం చేశారు. గతంలో ఖమ్మం జిల్లాలోని మారుమూల గిరిజన ప్రాంతంలో గల గుండాల మండలాన్ని అభివృద్ధి చేసిన ఘనత తుమ్మలకే దక్కుతుందని తెలిపారు. ఖమ్మం, కొత్తగూడెం లలో జర్నలిస్టుగా పనిచేస్తున్న సందర్భంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎన్నో కార్యక్రమాలకు, సమావేశాలకు తాను హాజరయ్యానని, ఆ రోజులు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. జర్నలిస్టుగా తనకు ఆయనంటే ఎంతో గౌరవం అని, మానవత్వం తొణికిసలాడే హృదయం ఉన్న సహృదయుడు తుమ్మల అని కొనియాడారు. కాలగమనంలో నాలుగు దశాబ్దాలు గడిచిపోయినా అప్పట్లో ఖమ్మంలో నాగేశ్వరరావు చెరగని ముద్ర వేశారని అది నేటికీ స్ఫూర్తినిస్తోందని తెలియజేశారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 40 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా నిష్కళంక ప్రజానాయకుడైన రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో ప్రజలకు విశేషంగా సేవ చేయుటకు ఆయనకు నిండు నూరేళ్లు ఆయురారోగ్యములను ప్రసాదించాలని దేవున్ని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

# గ్రామ మల్టీపర్పస్ వర్కర్లకు రెండు నెలల నుంచి జీతాలు కరువు

**భానుడి సెగకు,వర్కర్లు ఇబ్బందులు**

**జూలూరుపాడు: మే 12, (తెలంగాణ వాణి ప్రతినిధి ):**
మండల పరిధిలో 24 గ్రామ పంచాయతీలలో మల్టీపర్పస్ వర్కర్లుగా పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్నటువంటి 83 మంది పారిశుద్ధ్య కార్మికులకు గత రెండు నెలల నుండి సంబంధిత అధికారులు జీతాలు అందించకపోవడంతో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ వస్తున్నారు .ఏప్రిల్ మాసం గడిచిన మే నెల కూడా సగానికి వచ్చింది .విపరీతమైన ఎండలకు కొందరు గ్రామపంచాయతీ కార్మికులు వడదెబ్బతో ఆసుపత్రి పాలైన పరిస్థితులు కూడా మండల వ్యాప్తంగా అక్కడక్కడ కనిపిస్తుంది.కానీ కనీసం స్థానిక ప్రజా ప్రతినిధులు ,సంబంధిత అధికారులు , కనీసం పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య భద్రత నిమిత్యం కొరకు జీతాలు వచ్చిన తర్వాత కట్ చేసుకుని ముందుగా రెండు మూడు వేలు ఇచ్చేటటువంటి పరిస్థితులు కూడా లేవు .అదేవిధంగా వలస కార్మికులకు ఇచ్చేటటువంటి బెనిఫిట్స్ కూడా గ్రామపంచాయతీ కార్మికులకు ఇవ్వనటువంటి పరిస్థితులు మండల వ్యాప్తంగా ఉన్నవి



రాష్ట్ర ప్రభుత్వ గ్రామపంచాయతీ కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న పనితీరుకు కార్మికులు కొందరు ఆందోళన చెందుతున్నారు ఏది ఏమైనా తక్షణమే గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు ఆగినటువంటి జీతాలను తక్షణమే అందించి వారికి సమాన పనికి సమాన వేతనం అందించకుంటే వారి జీవితాల్లో వెలుగులు రావు వలస కార్మికులకే కాంట్రాక్టర్ ప్రతి నెల ఏడో తారీఖు నుండి పదో



తారీకు వరకు వారి కూలి ఇవ్వాల్సి ఉంటుంది అలాంటిది పారిశుద్ధ్య కార్మికులకు నెలలు నెలలు తరబడి ఎందుకు జీతాలు ఆపాల్సి వస్తుంది ఇలాంటి పరిస్థితిని చూస్తుంటే గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల కంటే వలస కార్మికులే బెటర్ అనే విధంగా ఉంది అంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు.

# కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్య సేవలు ప్రారంభం -డా" శ్రీధర్

**ధర్మారం :మే12 ( తెలంగాణ వాణి )**
పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను వారి నివాసాలకు దగ్గరగా అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. తెలంగాణలో పేద ప్రజలకు కార్పొరేట్ తరహా వైద్యం అందించే లక్ష్యంతో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇదివరకే తెలిపారు. ఈ క్రమంలో ధర్మారం మండలంలోని నంది మేడారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి 5 కోట్ల రూపాయలతో నిర్మించబడిన 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు మంగళవారం నంది మేడారం ఆసుపత్రిలో ఓపి సేవలు ప్రారంభించినట్లు సూపరింటెంట్ డాక్టర్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో పూర్తిస్థాయిలో అన్ని రకాల వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ వైద్య సేవలను చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఉపయోగించుకోవాలని డాక్టర్ శ్రీధర్ కోరారు.



# మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీని కొనసాగించాలి

**రాజాపేట, మే 12:(తెలంగాణ వాణివిలేకరి )**
కేంద్ర ప్రభుత్వం చేస్తున్న పాత చట్టాన్ని దద్దుచేసి విబి రాంజీ చట్టాన్ని తీసుకువచ్చిన దాన్ని రద్దు చేసి పాత పద్ధతి పాత చట్టమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీని కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జూకంటి పౌల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పాత చట్టాన్ని రద్దుచేసి విబి రాంజీ చట్టాన్ని తీసుకొచ్చి దాని రద్దుచేసి పాత చట్టం అయినా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ హామీ కొనసాగించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి కార్మికులు గ్రామీణ ప్రాంతంలో సంపద సృష్టిలో కీలకపాత్ర పోషిస్తున్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నారని, ఉపాధి హామీ




ద్వారా చెరువులో పూడికతీత గట్ల నిర్మాణాలు మట్టి పనులు రహదారులు కాలువలు నిర్మాణం పేదల భూములను అభివృద్ధి, మొక్కలు నాటడం వంటి పనుల ద్వారా ఉపాధి కూలీలు గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ఆస్తులను పెంచుకుంటున్నారన్నారు. ఇలాంటి అభివృద్ధి కీలక పాత్ర పోషిస్తున్న కుటుంబాలను పోషించుకుంటున్నారని కార్మికుల పొట్టగొట్టి ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసే బి.రాంజీ పథకాన్ని పథకం తెచ్చి కొత్త కొత్త జీవోలతో కార్మికులను పనికి దూరం చేస్తున్నారని పని ప్రదేశాల్లో మౌలిక వసతులు ఎత్తివేసి కార్మికుల ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. చేసిన పనికి కూలి ఎంత వస్తుందో చెప్పకుండా వారం వారం డబ్బులు ఇవ్వకుండా కార్మికుల అవస్థల పాలు చేస్తున్నారని ఇప్పటికైనా ఉపాధి హామీ కార్మికుల సమస్యలను పరిష్కరించి పాత చట్టాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు ఈ నెల 15 జరిగే గ్రామీణ సమ్మె బందును జయప్రదం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కట్ట రవికుమార్ మండల అధ్యక్షులు గంధ మల్ల రాజయ్య సహాయ కార్యదర్శి ఎంజాయ్ మైసయ్య గొల్లూరి ప్రభాకర్ ముఖ్య సలహాదారుడు బి రాములు పరమేష్ మధు శ్రీకాంత్ ఉమా మహేశ్వర్ లక్ష్మయ్య పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# యమపూర్ గ్రామంలో ఉపాధి హామీ పనుల పరిశీలన

**ఇబ్రహీంపట్నం మే 12 (తెలంగాణ వాణి విలేకరి)**
జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం యమపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో సిహెచ్ గణేష్ పరిశీలించారు. గ్రామంలో చేపడుతున్న పనులను ఆయన సమగ్రంగా తనిఖీ చేశారు గ్రామంలో నర్సరీ లో గల మొక్కలను పరిశీలించారు.అలాగే పనులను నాణ్యతతో నిర్వహించాలని, కూలీలందరికీ ఓ ఆర్ ఎస్ పాకెట్స్,మజ్జిగ పాకెట్స్ ఎండ తీవ్రత నుండి రక్షణ కొరకు టవల్స్ లను పంపిణీ చేశారు.కూలీలతో మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామ అభివృద్ధికి ఉపయోగపడే



విధంగా పనులు సక్రమంగా చేయాలని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనుక నాగేష్ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ ప్రభాకర్,పంచాయతీ కార్యదర్శి నవీన్, టెక్నికల్ అసిస్టెంట్ వినోద్,వార్డు మెంబర్లు, పాల్గొన్నారు.

# నర్సుల సేవలు అమూల్యం

**అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ రాజర్షిషా**

**ఆదిలాబాద్, మే : 12 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
వైద్య రంగంలో నర్సుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు.స్థానిక రిమ్స్ ఆడిటోరియంలో నిర్వహించిన అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్య సేవల్లో నర్సులు చూపుతున్న అంకితభావాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రోగుల పట్ల నర్సులు చూపే కరుణ, సేవాభావం వెలకట్టలేనివని కొనియాడారు. వైద్యులు చికిత్స అందిస్తే, నర్సులు తమ వృత్తిపట్ల ఉన్న అంకితభావంతో రోగులు త్వరగా కోలుకునేలా చేస్తారని



అన్నారు. అందుకే వారిని గౌరవప్రదంగా 'సిస్టర్స్' అని పిలుస్తామని పేర్కొన్నారు. రిమ్స్ ఆసుపత్రికి వచ్చే పేద రోగులకు మెరుగైన సేవలు అందించడంలో నర్సింగ్ సిబ్బంది ఎల్లప్పుడూ ముందు ండాలని సూచించారు.అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన నర్సులను కలెక్టర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రవంలో రిమ్స్ డైరెక్టర్ డా.జైసింగ్ రాథోడ్, డిప్యూటీ సూపరింటెండెంట్. డా.నరేందర్, నర్సింగ్ సూపరింటెండెంట్లు కల్పన, రమాదేవి, ఉమ, నర్సింగ్ సిబ్బంది, ఇతర వైద్య అధికారులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

**వనపర్తి , మే 12,( తెలంగాణ వాణి ప్రతినిధి ):**
వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మంగళవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం జరుపుకున్నారు. రోగుల సేవలో నిరంతరం శ్రమించే నర్సులను గుర్తించి సత్కరించి అభినందనలు



తెలియజేసిన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ కుమారి , సిఎస్ అర్ఎంఓ రెడ్డి కుమారి, అర్ఎంఓ శివప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై నర్సుల సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా బ్లడ్ సెంటర్ నర్సింగ్ స్టాఫ్ కృష్ణవేణి, లక్ష్మీని అధికారులు శాలువాతో సత్కరించి, వారి అంకితభావానికి అభినందనలు తెలిపారు. రోగుల ప్రాణాలను కాపాడటంలో నర్సులు పోషించే పాత్ర వెలకట్టలేనిదని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.ఈ వేడుకలో బ్లడ్ సెంటర్ సిబ్బంది వాకిటి రమేష్ , సంతోష్, లక్ష్మీపతి, మహమ్మద్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆకస్మికంగా తనిఖీ చేసిన డిఎంహెచ్ ఓ

**జహీరాబాద్/ఝురాసంగం: మే 12(తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఝురాసంగం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వసంతరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను, ఆసుపత్రి నిర్వహణను ఆయన నిశితంగా పరిశీలించారు.?ఈ సందర్భంగా డాక్టర్ వసంతరావు ఆసుపత్రిలోని ఓపీ విభాగం, మందుల నిల్వ గది, ల్యాబ్ సేవలు మరియు ఆసుపత్రి ప్రాంగణంలోని శుభ్రతను తనిఖీ చేశారు.



# రెండవ విడత మెగా డ్రైవింగ్ లైసెన్స్ మేళ కు యువతకు ఆహ్వానం.

## 3 మండలాల యువత, ప్రజలు ఈ నెల 16 వరకు వివరాలను పోలీస్ స్టేషన్ నందు నమోదు చేసుకోవాలి

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ .**

**ఆదిలాబాద్, మే : 12 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**



"అరైవ్ అలైవ్" లో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలో యువతీ, యువకులు, ప్రజలు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు వాహన నియమ నిబంధనలు పాటించడానికి ప్రత్యేకంగా జిల్లా పోలీసు యంత్రాంగం మొదటి విడతలో 5 మండలాలలోని ప్రజలకు డ్రైవింగ్ లైసెన్స్ మేళా ప్రారంభించి 205 మంది యువతి, యువకులకు, ఆదివాసీలకు లైసెన్స్ లను అందజేయడం జరిగింది. అదేవిధంగా ఈరోజు నుండి రెండవ విడత డ్రైవింగ్ లైసెన్స్ మేళా ప్రారంభం కానున్న సందర్భంలో మూడు మండలాలలో మెగా డ్రైవింగ్ లైసెన్స్ మేళా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభిస్తున్నారు. ఈ సందర్భంగా ఈ 3 మండలాలు ఉట్నూర్, ఇంద్రవెల్లి, బజార్హత్నూర్ లలో యువత, ప్రజలు తమ యొక్క ఆధార్ కార్డు మరియు అడ్రస్ ప్రూఫ్ లేదా టెన్త్ క్లాస్ మెమో జిరాక్సులను సంబంధిత పోలీసు స్టేషన్ల నందు అందించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వీరూ మొదటగా ఆన్లైన్ నందు లేదా మీసేవ కేంద్రాల్లో లర్నింగ్ లైసెన్స్ కై 600 రూపాయల రుసుము చెల్లించవలసిందిగా ఉంటుందని, తదుపరి లర్నింగ్ డ్రైవింగ్ లైసెన్స్ వచ్చిన తర్వాత నెల రోజుల నుండి ఆరు నెలల లోపు పర్మినెంట్ లైసెన్స్ కొరకు 1200 రూపాయల రుసుమును ప్రభుత్వానికి చెల్లించవలసింది ఉంటుందని తెలియజేశారు. ఈ మెగా డ్రైవింగ్ లైసెన్స్ మేళా ను ప్రజలు, యువత పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలిపారు. ఈనెల 16వ తారీకు వరకు రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. యువత ప్రజలు వాహన నియమనిబంధనలు పాటించాలని ప్రమాదాలకు గురి కాకుండా లైసెన్సులు నియమాలు ఉపయోగపడతాయని సూచించారు. యువత లైసెన్స్ కలిగి ఉండడం వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నట్లు తెలిపారు.

# ధాన్యం తరలింపును వేగవంతం చేయండి

- కొనుగోలు చేసిన వెంటనే మిల్లులకు చేర్చాలి
- కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నిజామాబాద్, మే 12 : (తెలంగాణ వాణి ప్రతినిధి)**

కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు ధాన్యం తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. పెర్కిట్ శివారులో మెప్మా, సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ మంగళవారం సందర్శించారు. రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. రోజువారీగా ఎంత ధాన్యం సేకరిస్తున్నారు, రైస్ మిల్లులకు ఎన్ని లోడ్ ల లారీలు వెళ్తున్నాయి, ట్రక్ షీట్లు వెంటవెంటనే తెప్పించుకుని ట్యాబ్ ఎంట్రీలు చేస్తున్నారా, హమాలీలు సరిపడా సంఖ్యలో ఉన్నారా అని ఆరా తీశారు. ధాన్యం సేకరణ, మిల్లులకు తరలింపు వివరాలతో కూడిన రికార్డులను పరిశీలించారు. అకాల వర్షాలు కురిస్తే ధాన్యం తడిసిపోయే అవకాశం ఉన్నందున జాప్యానికి తావు లేకుండా ధాన్యం తరలింపును వేగంగా చేపట్టాలని కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. అవసరమైతే హమీలీల సంఖ్యను పెంచాలని, ధాన్యం రవాణాకు సరిపడా లారీలను సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. 17శాతానికి లోబడి తేమ ఉన్న ధాన్యాన్ని రైతులు కేంద్రాలకు తెచ్చిన వెంటనే తూకం జరిపెంచాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అనవసర కాలయాపన కాకుండా, రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని హితవు పలికారు. రైస్ మిల్లుల వద్ద ధాన్యాన్ని వెంటవెంటనే అన్ లోడ్ చేసుకుంటున్నారా లేదా అన్నది క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. సకాలంలో బిల్లుల చెల్లింపులు జరిగేలా ట్యాబ్ ఎంట్రీలను వేగంగా జరిపించాలని అన్నారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, డీఆర్డీఓ సాయన్న, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్, డీసీఓ ఎన్.శ్రీనివాస్ రావు, తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

# మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలుగకూడదు.

**రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి.**

**నిర్మల్, మే:12(తెలంగాణ వాణి ప్రతినిధి)**



మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం, సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్రంలో వరి, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియపై పలువురు మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, తదితర ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాదు నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, మొక్కజొన్న, వరి పంటల కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. హమాలీలు, గన్ని సంచులు, ధాన్యం తరలింపునకు లారీలు, ధాన్యం నిల్వ చేయడానికి తగిన స్థలాల కొరత లేకుండా చూడాలన్నారు. ధాన్యం సరఫరాకు అవసరమైతే లారీలతో పాటుగా ట్రాక్టర్లను కూడా వినియోగించుకోవాలన్నారు. ధాన్యం తరలింపుకు సంబంధించి లారీల కాంట్రాక్టర్లు అలసత్వం వహిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం లోడింగ్, అన్ లోడింగ్ ప్రక్రియకు అవసరమైతే స్థానిక హమాలీలను నియమించుకోవాలని పేర్కొన్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన వెంటనే వారికి రశీదులు ఇవ్వాలన్నారు. అకాల వర్షాల వల్ల రైతులు తమ పంటలు నష్టపోకుండా చూడాలన్నారు. వాతావరణ సమాచారం ఎప్పటికప్పుడు రైతులకు చేరవేసేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్లందరూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను స్వయంగా పర్యవేక్షిస్తూ ఉండాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలిగితే ఎట్టిపరిస్థితుల్లో సహించేది లేదని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి ఈ వీసీలో పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మొక్కజొన్న, వరి పంటల కొనుగోలు సాఫీగా పూర్తి చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వేగం పెంచాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి అన్లోడింగ్ పాయింట్ లు దగ్గర్లో ఉంటే ట్రాక్టర్ల ద్వారా ధాన్యం సంచులు తరలించే విధంగా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సంచులు నిల్వ ఉంచరాదని పేర్కొన్నారు. ధాన్యం తూకం, తరలింపులో ఎట్టి పరిస్థితుల్లో రైతుల నుంచి డబ్బులు వసూలు చేయరాదని హెచ్చరించారు. ఈ వీసీ లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, పౌర సరఫరాల అధికారి, మేనేజర్ లు రాజేందర్, సుధాకర్, డిఎం మార్క్ ఫెడ్ మహేష్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వేసవి శిబిరాలతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరుగుతాయి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**

**నిర్మల్, మే:12(తెలంగాణ వాణి ప్రతినిధి)**



వేసవి శిబిరాలతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరుగుతాయని జిల్లా కలెక్టర్ కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మంగళవారం, పట్టణంలోని జుమ్మెరాత్ పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్, పిల్లలతో ముచ్చటించి వారి వివరాలు, జీవిత లక్ష్యాలు ఏంటో అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు సమ్మర్ క్యాంప్ కి రావాలని చెప్పారు. సమ్మర్ క్యాంపులో ఆటలు, పాటలు, యోగ, డ్యాన్స్, ఇతర అంశాల్లో శిక్షణ ఇస్తారని వివరించారు. పిల్లలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. వేసవి శిబిరాలతో పిల్లల నైపుణ్యాల పెరుగుదలతో పాటు, వారిలో దాగి ఉన్న ప్రతిభ బయట పడుతుందన్నారు. ఉపాధ్యాయులు, శిక్షకులు, వేసవి శిబిరాలకు వచ్చే విద్యార్థులకు అన్ని విషయాలు చక్కగా నేర్పించాలని వివరించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. పదవ తరగతి పరీక్షల్లో అనుత్తీర్ణులైన విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ, అందరూ ఖచ్చితంగా ఉత్తీర్ణత సాధిస్తారని, అధైర్య పడవద్దని ప్రోత్సహించారు. ఆయా సబ్జెక్టులు శ్రద్ధగా చదువుకొని ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఎటువంటి సందేహాలు ఉన్న ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, విద్యార్థుల ందరూ ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని అన్నారు. వారి భయాలు, సందేహాలు తొలగించి, వారిని ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈఓ భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లపై సీఎం సమీక్ష

- రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి
- నిర్లక్ష్యం సహించేది లేదు... కలెక్టర్లు ప్రత్యక్ష పర్యవేక్షణ చేయాలి....ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**నిజామాబాద్, మే 12 : (తెలంగాణ వాణి ప్రతినిధి)**



రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోళ్లు, వరి ధాన్యం సేకరణ ప్రక్రియపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, సీతక్క, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదితర ఉన్నతాధికారులు వీ.సీలో పాల్గొన్నారు. నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ నుండి ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీ.ఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యాన్ని ప్రభుత్వం ఏమాత్రం సహించబోదని స్పష్టం చేశారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోలు కేంద్రాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాములకు తరలించాలని ఆదేశించారు. ధాన్యం రవాణాకు అవసరమైన లారీలను ఒప్పందం మేరకు అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి వెనకాడవద్దని స్పష్టం చేశారు. వాహనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ కమిషనర్ ను ఆదేశించారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని సీఎం సూచించారు. గోదాముల కొరత ఉన్న ప్రాంతాల్లో రైతు బజార్లు, ఫంక్షన్ హాళ్లను తాత్కాలిక నిల్వ కేంద్రాలుగా వినియోగించాలని అన్నారు. మొక్కజొన్న పంట అధికంగా పండే జిల్లాల్లో కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. కొనుగోళ్ల పురోగతిపై ఎప్పటికప్పుడు సీఎస్కు నివేదికలు పంపాలని ఆదేశించారు. ధాన్యం లోడింగ్లో జాప్యం లేకుండా స్థానిక హమాలీలను గుర్తించి వినియోగించుకోవాలని, ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లారీల కొరత ఉన్న ప్రాంతాల్లో ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని తెలిపారు. అకాల వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, శాశ్వత పరిష్కారాల కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికల ఆధారంగా రైతులను ముందస్తుగానే అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించాలని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక అధికారిని నియమించాలని ఆదేశించారు. ప్రతి రైస్ మిల్లు వద్ద ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షణ చేయాలని, మిషన్ మోడ్లో పని చేస్తేనే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని ముఖ్యమంత్రి సూచించారు. జిల్లా కలెక్టర్లు ప్రత్యక్ష పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ధాన్యం సేకరణలో నిజామాబాద్ జిల్లా మొదటి స్థానంలో ఉందని, మొక్కజొన్న కొనుగోలు సైతం 88శాతం పూర్తయ్యిందని ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణను నిరంతరం పర్యవేక్షణ జరుపుతున్నామని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, ఎక్కడైనా చిన్నచిన్న సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరిస్తున్నామని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, పౌర సరఫరాల శాఖ అధికారులు శ్రీకాంత్ రెడ్డి, ప్రవీణ్, అరవింద్ రెడ్డి, డీఆర్డీఓ సాయన్న, మార్క్ఫెడ్ డీఎం క్రాంతి, మార్కెటింగ్ శాఖ ఏ.డీ గంగుబాయి, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్, రవాణా శాఖ డీటీసీ దుర్గా ప్రమీల, ఎంవీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ధాన్యం తరలింపునకు లారీలను సిద్ధం చేయాలి

- గంజాల్ టోల్ప్లాజా వద్ద కలెక్టర్ భవేశ్ మిశ్రా తనిఖీ
- రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశం

**నిర్మల్, మే:12(తెలంగాణ వాణి ప్రతినిధి)**



జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న వరి, మొక్కజొన్న ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు తరలించేందుకు అవసరమైన లారీలను సమకూర్చుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం సోన్ మండలం గంజాల్ టోల్ప్లాజా వద్ద లారీల సేకరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. టోల్ప్లాజా మీదుగా వెళ్తున్న ఖాళీ లారీలను గుర్తించి, వాటిని ధాన్యం రవాణాకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లారీ డ్రైవర్లు, యజమానులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి ప్రస్తుత పరిస్థితిని వివరించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పెరగకుండా వెంటనే వాహనాలను అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. అనంతరం మామడ మండలం న్యూ సాంగ్వి గ్రామ రహదారి వద్ద లారీల సేకరణ తీరును పరిశీలించిన కలెక్టర్, సిబ్బందికి పలు సూచనలు చేశారు. లారీల సేకరణ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగేందుకు షిఫ్టుల వారీగా సిబ్బందిని నియమించాలని తెలిపారు. విధుల్లో ఉన్న సిబ్బందికి టెంట్లు, కుర్చీలు, త్రాగునీరు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వాహనాలను ఆపిన వెంటనే సంబంధిత అధికారుల సమన్వయంతో అవసరమున్న కొనుగోలు కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు పండించిన పంటను రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ధాన్యం రవాణాలో ఎలాంటి జాప్యాన్నీ సహించబోమని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, తహసీల్దార్లు సంతోష్, సరిత, శ్రీనివాస్, రెవెన్యూ, రవాణా, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పశువుల అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు

- సమన్వయంతో పని చేస్తూ సమస్యలు తలెత్తకుండా చూడాలి
- బక్రీద్ సందర్భంగా సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్, సీ.పీ

**నిజామాబాద్, మే 12 : (తెలంగాణ వాణి ప్రతినిధి)**



పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు గట్టి నిఘా కొనసాగించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య అధికారులను ఆదేశించారు. బక్రీద్ వేడుకను పురస్కరించుకుని కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జంతు సంక్షేమం, గోవధ నిషేధంపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పశువుల అక్రమ రవాణా నిరోధం, జంతు సంక్షేమ నియమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్, సీ.పీ సమీక్షించారు. బక్రీద్ పండుగను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. జంతు సంక్షేమం కోసం ఉద్దేశించిన చట్టాల ఉల్లంఘన జరగకుండా చూడాలని అన్నారు. గోవధ నిషేధ చట్టం ప్రకారం గోవులను వధించడంపై నిషేధం ఉందని, తెలంగాణాలో ఒంటెలను కూడా వధించకుండా నిషేధం అమలులో ఉందని సూచించారు. ఈ విషయాలపై ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పిస్తూ, ఎక్కడ కూడా గోవులు, ఒంటెలను వధించకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పశువులను స్లాటర్ హౌజ్ లలోనే వధించాలని, రోడ్లపై ఎక్కడబడితే అక్కడ వధించరాదని సూచించారు. పశువులను తరలించడానికి, వాటిని వధించడానికి ముందు తప్పనిసరిగా పశు వైద్యాధికారిచే ధ్రువీకరణ పొందాలని అన్నారు. బక్రీద్ పండుగ దృష్ట్యా వెటర్నరీ వైద్యులు అన్ని చోట్ల సరిపడా సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు జిల్లాలోని కందకుర్తి, సాలూర, పొతంగల్, ఖండ్ గావ్ అంతర్రాష్ట్ర చెక్ పోస్టులతో పాటు, సాటాపూర్, యంచ, ఇందల్వాయి, ఉమ్మెడ, జన్నెపల్లి, మామిడిపల్లి తదితర ప్రాంతాల వద్ద ప్రత్యేకంగా అంతర్ జిల్లా చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నామని సీ.పీ తెలిపారు. రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖలకు చెందిన అధికారులు నిరంతరం నిఘా ఉండేలా పర్యవేక్షణ జరపాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలిస్తే వెంటనే సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పశువుల అక్రమ రవాణాకు సంబంధించి ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించాలని, క్షేత్రస్థాయికి వెళ్లి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా సంయమనంతో వ్యవహరిస్తూ అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు హితవు పలికారు. సీజ్ చేసిన పశువులకు తగిన షెల్టర్ కల్పిస్తూ, వాటికి పశుగ్రాసం, నీటి వసతి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సాటాపూర్, ఇందల్వాయి తదితర చోట్ల కొనసాగే పశువుల వారాంతపు సంతలలో నిబంధనలకు అనుగుణంగా, పశు సంరక్షణ చట్టానికి లోబడి క్రయవిక్రయాలు జరిగేలా చూడాలన్నారు. వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ పారవేయకుండా చూడాలని, వ్యర్థాలను వెంటదివెంట జనావాసాలకు దూరంగా తరలించేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులకు సూచించారు. సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా శాంతియుత వాతావరణంలో బక్రీద్ వేడుక జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ శుభం ప్రకాష్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, బోధన్ ఆర్డీఓ విజయలక్ష్మి, నిజామాబాద్, ఆర్మూర్ ఏసీపీ లు ప్రకాష్ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, డిప్యూటీ ట్రాన్స్ పోర్టు కమిషనర్ దుర్గా ప్రమీల, ఎంవీఐ లు శ్రీనివాస్, కిరణ్, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గంగాధరయ్య, పోలీస్, రెవెన్యూ, పశు సంవర్ధక, పంచాయతీ, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై.అత్యాచారం అత్యంత ఘోరం

**ఎస్సి కార్పొరేషన్ మాజీ చెర్మెన్ వై.నరోత్తం**

**జహీరాబాద్/టౌన్: మే 12(తెలంగాణ వాణి ప్రతినిధి)**

మైనర్ బాలికపై.అత్యాచారం జరిగిన సంఘటనపై ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై. నరోత్తం మాట్లాడుతూ కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ ఆయన కుమారుడు భగిరథ పై నమోదైన ఫోక్సో కేసును నీరు గార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి,బండి భగీరథ మైనర్ బాలికపై అత్యాచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ముఖ్యమంత్రి హోంశాఖను తనవద్దే ఉంచుకొని పట్టించుకోకపోవడం చాలా దారుణం.మైనర్ బాలికపై అఘాయిత్యాలకు పాల్పడ్డాడన్న ఆరోపణలతో భగీరథపై ఎఫ్ఐఆర్ నమోదుచేసి మూడు రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు అరెస్ట్ చేయకపోవడంలో అర్ధమేమిటి,ముఖ్యమంత్రి ఆదేశాలతోనే పోలీసులు అరెస్ట్ చేయడంలో జాప్యం చేస్తున్నారు.బాలికను వారి కుటుంబ సభ్యులను పోలీసులు బెదిరిస్తూ ఫోక్సో కేసు కాకుండ సాదారణ కేసుగా మార్చి కేసును నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి.మంత్రుల కొడుకులకు ఒక న్యాయం ఇతరులకు మరో న్యాయమా ప్రజలకు చట్టాలపై ఉన్న నమ్మకం దెబ్బ తినకుండా ఉండాలంటే పోలీసులు తమ విధులను నిష్పక్షపాతంగా నిర్వహించి భగీరథ్ ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్,ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, నాయకులు యస్.గోపాల్, నబిసాబ్,తదితరులు ఉన్నారు.



## భైంసా మున్సిపల్ కో-ఆప్షన్ ఎన్నిక వాయిదా ప్రజాస్వామ్య విరుద్ధం: ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



**నిర్మల్ - భైంసా: మే 12 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
నిర్మల్ జిల్లా భైంసా మున్సిపల్ కో ఆప్షన్ ఎన్నికను వాయిదా వేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇవ్వడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తీవ్రంగా విమర్శించారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ చైర్మన్ తుమ్మోల్ల దత్తాత్రి, బీజేపీ మరియు ఇండిపెండెంట్ కౌన్సిలర్లు అర్ధరాత్రి నుంచి చేపట్టిన నిరాహార దీక్షకు ఎమ్మెల్యే సంఘీభావం తెలిపారు.?ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సోమవారం కో ఆప్షన్ ఎన్నిక నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ స్వయంగా చెప్పారని, ఆయన అనుమతితోనే మే 12న ఎన్నిక జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ తెలియజేశారని అన్నారు. అయితే సోమవారం రాత్రి అకస్మాత్తుగా వాట్సాప్ సందేశం ద్వారా ఎన్నిక రద్దయిందని తెలియజేయడం సరికాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిక ఎందుకు వాయిదా వేశారో జిల్లా కలెక్టర్ మరియు మున్సిపల్ కమిషనర్ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. అధికారుల తీరు ఎంఐఎం పార్టీకి మరియు ప్రభుత్వానికి వత్తాసు పలికినట్లుగా ఉందని ఆయన ఆరోపించారు.?ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరించిన జిల్లా కలెక్టర్ మరియు అధికారులపై ఫిర్యాదు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ అంశంపై హైకోర్టును ఆశ్రయిస్తామని, అవసరమైతే అసెంబ్లీలో కూడా ప్రస్తావిస్తానని పేర్కొన్నారు. కో ఆప్షన్ ఎన్నిక నిర్వహించే వరకు కౌన్సిలర్లు మరియు మున్సిపల్ చైర్మన్ అక్కడే బైఠాయిస్తారని, వారికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.?పద్దెనిమిది సంవత్సరాలు భైంసా మున్సిపాలిటీని పాలించిన ఎంఐఎం పార్టీకి ఇంకా అధికార దాహం తగ్గలేదని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రజలు బీజేపీకి అధికారం ఇచ్చినా ఎంఐఎం ఓర్వలేక కుట్రలకు పాల్పడుతోందని మండిపడ్డారు. మున్సిపల్ పాలకవర్గం ఏర్పడి కేవలం రెండు నెలలే అయ్యాయని, ఇలాంటి రాజకీయాలు తగవని వ్యాఖ్యానించారు. పాలకవర్గం పిలుపు మేరకు బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపిన ప్రజలందరికీ ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ఈ నిరహార దీక్షలో మున్సిపల్ చైర్మన్ తుమ్మోల్ల దత్తాత్రి, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ ఆంజనేయ స్వామి జన్మోత్సవ వేడుకలు

### స్వామి వారి నామస్మరణతో మార్మోగిన ప్రాంతం



**రాజాపేట మే 12 :(తెలంగాణ వాణి విలేఖరి)**
రాజపేట శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో మంగళవారం శ్రీ ఆంజనేయ స్వామి వారి జన్మోత్సవ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో సాంప్రదాయంగా చేశారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వేదిక బ్రాహ్మణులు ఆలయ అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ శాశ్వత అధ్యక్షులు నంగునూరు చంద్రశేఖర్ ట్రస్ట్ అభివృద్ధి సేవా కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని దాతల సహకారంతో జరిపారు. శ్రీ ఆంజనేయ స్వామి వారికి ఉత్సవ మూల విగ్రహాలకు పంచామృత, మాన్య సూక్త అభిషేకాలు, అష్టోత్తర శత నాగవల్లి దళార్చన, వడమాల సమర్పణ, విశేషాలంకరణ హనుమాన్ చాలీసా పారాయణం, మహా నైవేద్య నివేదన పూర్ణహుతి, మాన్య సూక్త మూలమంత్ర హవనములు, మహదాశిర్వచనం తీర్థ ప్రసాద వితరణ అన్న ప్రసాద వితరణ రాత్రి పల్లకి సేవ మహోత్సవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు జరిగాయి.

## హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్ చెరు, మే 12, (తెలంగాణ వాణి రిపోర్టర్)**
హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పటాన్ చెరు పట్టణంలోని పంచముఖి హనుమాన్ దేవాలయం, చైతన్య నగర్ హనుమాన్ దేవాలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ని ఘనంగా సన్మానించారు. నియోజకవర్గ ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియచేశారు. స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కంకర శ్రీనివాస్, ఆయా ఆలయాల కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# కొండగట్టులో భారీ భద్రత

- అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలకు పటిష్ట భద్రత
- భక్తుల కోసం ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు
- రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు రేడియం స్టిక్కర్ల వినియోగం

**జగిత్యాల:మే 12(తెలంగాణ వాణి ప్రతినిధి)**
హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ నేపథ్యంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ గారు అర్ధరాత్రి ఆకస్మికంగా పర్యటించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో చేపట్టిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, అత్యవసర సేవల అందుబాటు వంటి అంశాలను ఆయన స్వయంగా పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేస్తూ, పోలీస్ అధికారులకు, సిబ్బందికి వైర్లెస్ సెట్ల ద్వారా ఎప్పటికప్పుడు సూచనలు, ఆదేశాలు జారీ చేస్తూ అన్ని విభాగాల మధ్య సమన్వయం కల్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మాల విరమణ, దర్శనం చేసుకునేలా చర్యలు



తీసుకోవాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో పటిష్ట బందోబస్తు కొనసాగించాలని, అనుకోని ఘటనలు చోటుచేసుకున్న వెంటనే స్పందించేలా యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు.

**భక్తుల కోసం ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు**
భక్తులకు తక్షణ సహాయం అందించేందుకు పోలీస్, రెవెన్యూ మరియు వైద్య శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా కాలినడకన వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మార్గమధ్యంలో సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసి, తాగునీరు, ప్రథమ చికిత్స, మార్గదర్శక సేవలు అందిస్తున్నారు.

**రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు రేడియం స్టిక్కర్ల వినియోగం**
హనుమాన్ దీక్ష తీసుకున్న దీక్షపరులు కాలినడకన కొండగట్టుకు చేరుకునే సమయంలో ముఖ్యంగా రోడ్డు ఇరువైపులా జాగ్రత్తగా నడుస్తూ, వాహనాలను గమనిస్తూ తమ గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఎలాంటి రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోకుండా జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలో భాగంగా భక్తుల బ్యాగులు, జెండాలు, ఇతర వస్తువులపై రేడియం స్టిక్కర్లను అంటించడం జరిగింది. చీకటి సమయంలో కూడా ఈ రేడియం స్టిక్కర్లు స్పష్టంగా కనిపించడంతో వాహనదారులు దూరం నుంచే భక్తులను గమనించి తమ వాహనాల వేగాన్ని తగ్గించే అవకాశం ఉంటుంది. దీని ద్వారా రోడ్డు ప్రమాదాలను సమర్థవంతంగా నివారించవచ్చుఅన్నారు.

## ముత్తంగి లో 84 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్ చెరు, మే 12, (తెలంగాణ వాణి రిపోర్టర్)**
ముత్తంగి డివిజన్ ను అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళ వారం డివిజన్ పరిధిలోని డి ఎన్ కాలనీ, సాయి ప్రియా కాలనీ, పార్థ కాలనీలలో 84 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, యుజిడి నిర్మాణ పనులకు స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కాలనీలలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటు లోకి తీసుకొని రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, ఈ ఈ సురేష్, డిఈ కృష్ణవేణి, మాజీ సర్పంచ్ ఉపేందర్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, ప్రభాకర్, కుమార్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, కిట్టు, అమ్జాద్, ఆయా కాలనీల అధ్యక్షులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రసాయన శాస్త్రంలో లీలా ప్రసాద్‌కు పీహెచ్.డీ.

**పటాన్ చెరు, మే 12, (తెలంగాణ వాణి రిపోర్టర్):**
హైదరాబాదు లోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి లీలా ప్రసాద్ కౌతారపు డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'ద్రవ ఔషధ మోతాదు రూపాల నాణ్యతను అంచనా వేయడానికి డిజైన్ ద్వారా నాణ్యత దృష్ట్యా హరిత విశ్లేషణాత్మక పద్ధతి అభివృద్ధి' చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.రత్నమాల మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ లీలా ప్రసాద్ డాక్టరల్ పరిశోధన, ఔషధ ద్రవ ఫార్ములేషన్ల కోసం సుస్థిరమైన, విశ్వసనీయమైన హరిత క్రోమాటోగ్రాఫిక్ విశ్లేషణాత్మక పద్ధతులను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించినట్టు తెలియజేశారు. ఈ అధ్యయనం, ఔషధ విశ్లేషణలో పటిష్టత, విశ్వసనీయతను నిర్ధారించడానికి క్వాలిటీ బై డిజైన్ (క్యూబీడీ) సూత్రాలను ఏకీకృతం చేస్తూ, మెరుగైన కచ్చితత్వం, ఎంపిక సామర్థ్యం, సున్నితత్వం, పునరుత్పత్తి సామర్థ్యం ద్వారా విశ్లేషణాత్మక రసాయన శాస్త్రాన్ని ముందుకు తీసుకు వెళ్లిందని పేర్కొన్నారు. ఈ పరిశోధన,



సెరోటోనిన్ రిసెప్టర్ యాంటాగోనిస్ట్ ఫార్ములేషన్లు, మాస్ట్ సెల్ స్టెబిలైజర్లు, హిస్టమైన్ రిసెప్టర్ యాంటాగోనిస్టులు, లింకోసమైడ్ యాంటీబయాటిక్ ఇంజెక్టబుల్స్ విశ్లేషణలో, యాంటీబయాటిక్ లిక్విడ్ ఫార్ములేషన్లలో క్యాన్సర్ కారక, జన్యు విషపూరిత మలినాలను అతి తక్కువ స్థాయిలో నిర్ధారించడంలో, అలాగే ఫిజియోలాజికల్ ద్రావణాల స్థిరత్వ అధ్యయనాలలో గణనీయమైన తోడ్పాటును అందించినట్టు వివరించారు. ఈ అధ్యయనం, సుస్థిరమైన, వినూత్నమైన ఔషధ విశ్లేషణాత్మక పద్ధతుల దిశగా ఒక ముఖ్యమైన ముందడుగును సూచిస్తోందన్నారు.

# ధాన్యం సేకరణలో వేగవంతం పెంచాలన్న మెదక్ జిల్లా కలెక్టర్

**మెదక్ జిల్లా మే: 12:(తెలంగాణ వాణి ప్రతినిధి)**
మంగళవారం రోజునకలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవోలు, సివిల్ సప్లై, వ్యవసాయ, మార్కెటింగ్, ట్రాన్స్పోర్ట్ , పోలీస్ , గ్రామీణాభివృద్ధి, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు,ఇతర శాఖల అధికారులతో గూగుల్ మీట్ సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా ధాన్యం



సేకరణ ప్రక్రియ ఎలా కొనసాగుతుందో అడిగి తెలుసుకున్నారు. రైస్ మిల్లులలో ఎంతమంది హమాలిలు ఉన్నారని , ఎన్ని లారీలు ఉన్నాయని తాసిల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ మరింత వేగంగా జరగాలని, అన్లోడింగ్ ప్రక్రియలో హమాలీల సంఖ్య పెంచుకోవాలని, లారీల సంఖ్యను పెంచాలని, లారీలు అందుబాటులో లేకుంటే డీసీఎంలు, ట్రాక్టర్లను కూడా అనుమతించాలని , అధికారులందరూ క్షేత్రస్థాయిలో ఉండాలని,అకాల వర్షాలతో ధాన్యాన్ని కాపాడడానికి టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచుకోవాలనీ అధికారులను ఆదేశించారు. మిల్లర్లు అన్లోడింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి లారీలను అందుబాటులో ఉంచలన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ అంబాదాస్ రాజేశ్వర్,ఆర్డీఓ రమాదేవి జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, సివిల్ సప్లై అధికారి నిత్యానంద, ట్రాన్స్ పోర్ట్ అధికారి వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు

# కొండగట్టులో ఘనంగా పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలు

**పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్**

**జగిత్యాల మే 12 (తెలంగాణ వాణి)**
జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టులో ఘనంగా పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు.కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంలో కొనసాగుతున్న పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆలయ పరిసరాలు, క్యూ లైన్లు, మాల విరమణ ప్రాంతాలు, పార్కింగ్ స్థలాలు, తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను



పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతున్న నేపథ్యంలో భద్రతా చర్యలు కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి మౌలిక సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, ఆలయ ఈఓ అంజనా రెడ్డి, ఆర్డీఓ మధుసూదన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# హనుమాన్ జయంతి సందర్భంగా హిందూ ఏక్తా యాత్ర ర్యాలీకి పటిష్ట బందోబస్తు

**కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం**

**కరీంనగర్ మే 12 (తెలంగాణ వాణి)**
హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారంనాడు కరీంనగర్ నగరంలో నిర్వహించనున్న హిందూ ఏక్తా యాత్ర ర్యాలీ కోసం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. ఈ సందర్భంగా ర్యాలీ విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులకు ఆయన బ్రీఫింగ్ నిర్వహించారు. సుమారు 400 మంది పోలీసు అధికారులు బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారని ఆయన పేర్కొన్నారు. సున్నితమైన ప్రాంతాల్లో స్టాటిక్ ఫోర్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, రూఫ్‌టాప్ నిఘా, మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు వంటి పలు రకాల విధులను కేటాయించినట్లు కమిషనర్ తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు




తలెత్తకుండా అవసరమైన అన్ని చోట్ల దారి మళ్లింపు చర్యలు చేపట్టినట్లు వివరించారు. హిందూ ఏక్తా యాత్ర



శోభాయాత్రకు సంబంధించి పోలీసు శాఖ తరపున అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపట్టినట్లు కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం స్పష్టం చేశారు.




## అక్రమ రవాణా నిర్మూలన కోసం చెక్ పోస్టుల ఏర్పాటు: జిల్లా ఎస్పీ

౼,సూర్యాపేట: పశువుల అక్రమ రవాణా, ఇసుక, వరి ధాన్యం, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా పోలీసు శాఖ పటిష్ట నిఘా ఉంచినదని ఎస్పీ నరసింహ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్టులలో 24 గంటలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తునట్లు తెలిపారు. మంగళవారం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి 65 పై టేకుమట్ల వద్ద అంతర్ జిల్లా చెక్ పోస్ట్ జిల్లా ఎస్పీ నరసింహ సందర్శించి వాహనాల తనిఖీలు, చెక్ పోస్ట్ రికార్డులను పరిశీలించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సాధారణ ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి సూచించారు. తనిఖీల సమయంలో చెక్ పోస్ట్ సిబ్బంది స్వీయ రక్షణ జాగ్రత్తలు పాటించాలని కోరారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అక్రమ రవాణా నిర్మూలన లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ముఖ్యమైన ప్రాంతాలలో అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దు చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని అన్నారు. ఈ చెక్ పోస్ట్ ల ద్వారా అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలు, అనుమానత వ్యక్తులకు కదలికలపై పూర్తిస్థాయి నిఘా ఉంచామని అన్నారు. వరి ధాన్యం అక్రమ రవాణా జరగకుండా, పీడీఎస్ బియ్యం, ఇసుక, పశువుల అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన నిఘా ఉంచి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా అక్రమ రవాణాకు పాల్పడినట్లైతే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు వ్యవసాయ అవసరాల నిమిత్తం సంతలో కొనుగోలు చేసిన పశువుల రవాణా చేస్తే సంత అధికారులు, పశువుల వైద్యుల అనుమతి పత్రాలు వెంట తీసుకు వెళ్ళాలి అన్నారు. ఆయన వెంట సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ఎస్సై బాలు నాయక్, చెక్ పోస్ట్ విధులు నిర్వహణ సిబ్బంది, జాతీయ రహదారుల సిబ్బంది ఉన్నారు.

## వైద్యుల నిర్లక్ష్యంతో బాలుడి మృతి

నిజామాబాద్ : అనారోగ్యానికి గురైన తమ బిడ్డను చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళితే.. నాణ్యమైన వైద్యాన్ని అందించి బిడ్డను బతికించాల్సిన వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించి బిడ్డ నిండు ప్రాణాన్ని బలిగొన్న సంఘటన నిజామాబాద్ నగరంలోని ఓ ప్రైవేట్ చిల్డ్రన్స్ హాస్పిటల్ లో సోమవారం చోటుచేసుకుంది. వైద్యుల నిర్లక్ష్యానికి తమ బిడ్డ బలయ్యాడంటూ బాధిత పేరెంట్స్ , బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జక్రాన్‌పల్లి మండలం పడకల్ తండాకు చెందిన శిరీష, నరేష్ దంపతుల కొడుకు 15 నెలల నిక్షిత్ కు ఉన్నట్టుండి సోమవారం వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. డీ హైడ్రేషన్ తో బాబు చాలా నీరసించిపోవడంతో చికిత్స కోసం బాబును పేరెంట్స్ హుటాహుటిన జిల్లా కేంద్రంలోని సెక్యూర్ చైల్డ్ కేర్ ఆస్పత్రికి తరలించారు.

బాబుకు బ్లడ్ తక్కువగా ఉందని, హార్ట్ బీట్ కూడా స్లోగా ఉందని చెప్పి హాస్పిటల్ లో అడ్మిట్ చేయించుకుని ట్రీట్మెంట్ స్టార్ట్ చేశారు. చికిత్స అందిస్తున్న క్రమంలోనే బాబు ఒంటిపై దద్దుర్లు రావడం, ఎం ఆర్ ఐ స్కాన్ తీయడం వంటివి చేశారు. అయినా బాబు ఆరోగ్య పరిస్థితి విషమించి చనిపోయాడు. బాబును బతికించేందుకు చేయాల్సిన ట్రీట్మెంట్ అంతా చేసామని చెప్పి డాక్టర్లుచేతులు దులిపేసుకుంటున్నారనివాపోయారు. మంచి వైద్యం అందించిబిడ్డను బతికిస్తారనుకుంటే చంపేశారంటూ ఆస్పత్రి వైద్యులపై దుమ్మెత్తిపోసారు. ఆస్పత్రి ముందు బంధువులు, తండా వాసులు ఆందోళనకు దిగారు. దీంతో ఆస్పత్రి ఆవరణలో వాతావరణం ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. నిర్లక్ష్య వైద్యంతో పసిబిడ్డను పొట్టనబెట్టుకున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం డిమాండ్ చేసింది. తీవ్ర ఉద్రిక్తత నెలకొనడంతో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ రఘుపతి పరిస్థితిని సమీక్షించారు. ఈ ఘటనపై బాబు తండ్రి నరేష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ హెచ్ ఓ రఘుపతి తెలిపారు.

## బస్టాండ్ ఏర్పాటు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి



కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలో హైవే ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక బస్టాండ్ ఏర్పాటు చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు మంగళవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందించారు. నూతన బస్టాండ్ ఏర్పాటు విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా టీఎస్ఆర్టీసీ ఎండీ, కామారెడ్డి జిల్లా కలెక్టర్‌తో బస్టాండ్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలు, స్థలం కేటాయించాలని మంత్రి ఆదేశించారు. కామారెడ్డి జిల్లా కేంద్రం ఉత్తర తెలంగాణలో ప్రముఖ పట్టణంగా విస్తరిస్తుందని, ప్రస్తుతం లక్ష జనాభాకు పైగా ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఉన్న కొత్త బస్టాండ్ విస్తీర్ణం తక్కువగా ఉండటం వల్ల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. 44వ జాతీయ రహదారి విస్తరణతో ఆర్మూర్, నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, నాగ్‌పూర్, కోరుట్ల, మెట్‌పల్లి తదితర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు కామారెడ్డి పట్టణంలోకి రావడం లేదని, నాన్‌స్టాప్ బస్సుల కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. 44వ జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ భూమి ఆర్టీసీకి అనుకూలంగా ఉన్నందున ఆ స్థలాన్ని కేటాయించి నాన్‌స్టాప్ లేదా హైవే బస్టాండ్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనివల్ల ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలకు రాకపోకలు సాఫీగా జరుగుతాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో అడ్లూర్ కౌన్సిలర్ గడ్డమిది మహేష్, డీసీసీ ఉపాధ్యక్షులు నిమ్మ విజయ్ కుమార్ రెడ్డి, క్రెడా అధ్యక్షులు గణగోని లక్ష్మి నర్సాగౌడ్, కాంగ్రెస్ నేతలు శ్రీధర్ రావ్ ఉన్నారు.

# జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం

**తోలి విడుదలతో 146 అక్రిడేషన్ కార్డులు జారీ**

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**

**నాగర్ కర్నూల్ మే 12 (తెలంగాణ వాణి)**







జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధ్యక్షతన మంగళవారం సాయంత్రం నాగర్ కర్నూల్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో డీఎంఏసీ మొదటి సమావేశం లోకమిటీ సభ్యులను జిల్లా కలెక్టర్ పరిచయం చేసుకున్నారు. 2026 - 2028 కాల వ్యవధికి సంబంధించి అక్రిడిటేషన్ కార్డుల కోసం ఆన్లైన్ లో వచ్చిన దరఖాస్తులను ఈ సమావేశంలో పరిశీలన జరిపారు. 252 జీఓ నిబంధనలకు లోబడి అర్హత కలిగిన జిల్లా స్థాయి ప్రింట్ మీడియా స్టాపర్స్, ఎలక్ట్రానిక్ మీడియా చెందిన 146 దరఖాస్తులకు కమిటీ సభ్యులు ఆమోదం పలుకగా, కమిటీ ఛైర్ పర్సన్, కలెక్టర్ మంజూరు చేశారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు, అర్హులైన జర్నలిస్టులకు జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ద్వారా అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ సజావుగా, పూర్తి పారదర్శకంగా జరగాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. తదుపరి వచ్చే దరఖాస్తులను కూడా ఇదే తరహాలో క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు మంజూరయ్యేలా చూడాలన్నారు. హోల్డ్ లో తిరస్కరించిన దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు అందుకు గల కారణాలను డీపీఆర్ఓను అడిగి తెలుసుకున్నారు. తొలి విడతలో మంజూరు చేసిన అక్రిడేషన్ కార్డుల విషయంలో ఏమైనా ఫిర్యాదులు ఉన్నాయా అని కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కమిటీ సభ్యులందరూ ఎలాంటి సమస్యలు లేవని అర్హులందరికే మంజూరు చేయడం జరిగిందని కలెక్టర్ కు వివరించారు. అనంతరం కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ కు శాలువాతో సత్కరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సంబంధాల అధికారులు కిరణ్ కుమార్, ఆర్టీసీ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు పి విజయ్ కుమార్, చంద్రశేఖర రావు, సురేష్ కుమార్, దస్తగిరి, ప్రదీప్ కుమార్, ముబీన్ అహ్మద్ ఖాన్, వెంకటస్వామి, శ్రీనివాసులు, నేతాజీ గౌడ్, పాల్గొన్నారు.

# రానున్న 15 రోజులు మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లకు అత్యంత కీలకం

**జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి బ్యూరో మే 12 (తెలంగాణ వాణి)**





రానున్న 15 రోజులు మొక్కజొన్న ధాన్యం కొనుగోళ్లకు అత్యంత కీలకమని, క్షేత్రస్థాయిలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో జిల్లాలో మొక్కజొన్న ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొక్కజొన్న నిల్వలు, లోడింగ్ పరిస్థితులు, గోడౌన్ల అందుబాటు, రవాణా సదుపాయాలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యంగా ఇల్లందు నియోజకవర్గ పరిధిలో సుమారు 9,300 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న నిల్వలు ఉన్నాయని, లోడింగ్‌లో జాప్యం ఎందుకు జరుగుతోందనే అంశంపై కారణాలను అధికారులతో సమీక్షించినట్లు తెలిపారు. గోడౌన్ల అందుబాటు కోసం బయ్యారం, ములకలపల్లి, కృష్ణసాగర్, దుమ్ముగూడెం, వాజేడు, వెంకటాపురం, కొత్తగూడెం, బంగారుచిలక ప్రాంతాల్లో నిల్వ సదుపాయాలు అందుబాటులో ఉన్నందున త్వరితగతిన లోడింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. రానున్న మూడు రోజుల్లో ఇల్లందు ప్రాంతంలోని మొక్కజొన్నను గోడౌన్లకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.మార్క్‌ఫెడ్, రవాణా, మార్కెటింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి కొనుగోలు, రవాణా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. రవాణా విషయంలో లోడింగ్ కాంట్రాక్టర్లు అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. అవసరమైతే మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియలో పోలీస్ శాఖ సహకారం కూడా తీసుకోవాలని తెలిపారు.

హమాలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చూడాలని, ఎక్కడైనా గోడౌన్ సమస్య తలెత్తితే తాత్కాలికంగా ఫంక్షన్ హాళ్లు, పాఠశాల భవనాలు ఇతర అనుకూల భవనాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ప్రత్యేక అధికారిని నియమించి, ఆయా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలనలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రతిరోజూ కొనుగోలు వివరాలను నిరంతరం నివేదికల రూపంలో అందించాలని, కొనుగోలు పూర్తైన వెంటనే 24 గంటల్లో ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేసే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. అదనపు కలెక్టర్, డిసిఎస్‌వో, డీటీవో, డీఎం సివిల్ సప్లై తదితర అధికారులు ప్రతిరోజూ కొనుగోలు, లోడింగ్, అన్‌లోడింగ్, గోడౌన్ల పరిస్థితి, హమాలీల అందుబాటు, గన్నీ బ్యాగుల సరఫరా వంటి అంశాలను పర్యవేక్షిస్తూ సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు రైతులకు చేరవేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో నిరంతరం అందుబాటులో ఉండి మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసే దిశగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# విదేశాంగ వైఫల్యంతోనే ధరల భారం: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

కేంద్ర ప్రభుత్వం విదేశాంగ వ్యవహారాల్లో విఫలం కావడం వల్లే దేశంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరుగుతున్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో మంగళవారం నిర్వహించిన పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి ముందు పార్టీ సీనియర్ నాయకుడు ఎండీ పాషా జెండా ఆవిష్కరించగా, దివంగత నాయకుడు రొడ్డ అంజయ్య చిత్రపటానికి నేతలు నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాన్ వెస్లీ మాట్లాడుతూ.. అమెరికా, ఇజ్రాయిల్ కలిసి ఇరాన్‌పై చేస్తున్న యుద్ధ ప్రభావంతో దేశంలో ఇంధన ధరలు, నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయని అన్నారు. రష్యా, ఇరాన్‌లతో ఉన్న వ్యాపార సంబంధాలను పక్కనపెట్టి అమెరికాకు అనుకూలంగా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. ప్రజలకు ఉచిత సలహాలు ఇవ్వడం కాకుండా ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచే చర్యలు తీసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీకి సూచించారు. కార్మిక హక్కులను హరించే విధంగా కేంద్రం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను అమలు చేస్తోందని విమర్శించారు. విద్యుత్, విత్తన చట్టాలతో రైతులకు ఇబ్బందులు పెరిగాయని పేర్కొన్నారు. తెలంగాణలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళిత బంధు, మహిళలకు ఆర్థిక సహాయం, కౌలు రైతులకు సాయం వంటి హామీలు అమలు కాలేదని అన్నారు.




**చమురు నిల్వల కోసమే యుద్ధాలు: వీరయ్య**

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్. వీరయ్య మాట్లాడుతూ.. సామ్రాజ్యవాద దేశాలు చమురు నిల్వల కోసం యుద్ధాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. అమెరికా, ఇజ్రాయిల్ కలిసి ఇరాన్‌పై దాడులు చేస్తున్నా భారత్ ఖండించకపోవడం విచారకరమన్నారు. దేశ ప్రజల ఆత్మగౌరవాన్ని కేంద్ర ప్రభుత్వం అమెరికాకు తాకట్టు పెట్టిందని విమర్శించారు.

స్థానిక సమస్యలపై పోరాటాలు అవసరం..

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండి. జహంగీర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉన్న మౌలిక సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో నిర్వహించిన సర్వేలో అప్పుల్లేని కుటుంబం ఒక్కటి కూడా కనిపించలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ, కొండమడుగు నరసింహ, కల్లూరు మల్లేశం, మాటూరి బాలరాజు గౌడ్, జల్లెల పెంటయ్య, గుంటూజు శ్రీనివాసచారి, గోశిక కరుణాకర్, గంగాదేవి సైదులు, రాగీరు కిష్టయ్య, బత్తుల జయమ్మ దాసు తదితరులు పాల్గొన్నారు.

# ఎవరి ఒత్తిళ్లు, ఆంక్షలకు భారత్ తలొగ్గదని నిరూపించాం

ప్రపంచంలోని ఎవరి ఒత్తిళ్లు, ఆంక్షలకు భారత్ తలొగ్గదని నిరూపించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. అటల్ నేతృత్వంలో భారత్ సత్తా అంటే ప్రపంచానికి ఏమిటో చూపించామని గుర్తు చేశారు. గుజరాత్‌లోని పవిత్ర పుణ్యక్షేత్రమైన సోమ్?నాథ్ మహాదేవ్ ఆలయ పునర్నిర్మాణం జరిగి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. వేదికపై నుంచి 75 ఏళ్ల పునర్నిర్మాణానికి గుర్తుగా ప్రత్యేక పోస్టల్ స్టాంపుతో పాటు 75 రూపాయల స్మారక నాణేన్ని ప్రధాని విడుదల చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల అనంతరం ప్రధాని సద్భావన మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించారు.



"సోమనాథ్ దేవాలయ అభివృద్ధిలో శివుడి ఆశీస్సులు ఉన్నాయి. సోమనాథ్ దేవాలయ రూపురేఖలు పూర్తిగా మారుస్తున్నాం. 1951లో సోమనాథ్ దేవాలయ పునర్నిర్మాణం చేపట్టాం. భారత్ తన ప్రాచీన సంస్కృతిని, వారసత్వాన్ని కూడా పరిరక్షించుకుంటుంది. సోమనాథ్ పునర్నిర్మాణ పనుల ద్వారా దీన్ని ప్రపంచానికి చాటాం. భారత్ అంటే వేల ఏళ్ల ఆధ్యాత్మిక చైతన్యం కలిగిన దేశం. అసత్యంపై ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందని మన పూర్వీకులు నిరూపించారు. 1998 మే 11న ఇదేరోజు పోఖ్రాన్‌లో అణు పరీక్షలు చేపట్టాం. 1998లో అణు పరీక్షల ద్వారా భారత్ సత్తా చాటాం. అప్పటి అణుపరీక్షలు చూసి ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోయాయి. అణు పరీక్షల తర్వాత అనేక ఆంక్షలు విధించారు ఇబ్బంది పెట్టారు. మనం ఎవరి ఆంక్షలకు తలొగ్గలేదు ధైర్యంగా నిలబడ్డాం. 1998 మే 13న మరో రెండు అణు పరీక్షలు నిర్వహించాం. అటల్ నేతృత్వంలో భారత్ సత్తా అంటే ప్రపంచానికి ఏమిటో చూపించాం. భారత్ ఎవరి ఒత్తిళ్లు, ఆంక్షలకు తలొగ్గదని నిరూపించాం. చంద్రయాన్ ప్రాజెక్టులో రోవర్ దిగేచోటును శివశక్తి పాయింట్ అని పేరు పెట్టాం. శివుడికి, చంద్రుడికి అవినాభావ సంబంధం ఉంది. సోమనాథ్ దేవాలయ సంపదను గజనీ, ఖిల్జీ అనేకసార్లు దోచుకున్నారు. ఎన్ని సార్లు దాడులు చేసినా సోమనాథ్ దేవాలయం సగర్వంగా నిలబడింది. భారత్ ఆధ్యాత్మిక శక్తి గురించి విధ్వంసకారులకు తెలియదు. సోమ్‌నాథ్ ఆలయంలో నిర్వహిస్తున్న 'అమృత్ మహోత్సవం'లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. సోమ్‌నాథ్ ఆలయంలో ప్రధాని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 'అభిషేకం', 'ధ్వజ పూజ'తో పాటు 'మహా పూజ'లో ఆయన పాల్గొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా భారత వాయుసేనకు చెందిన 'సూర్యకిరణ్' టీమ్ నిర్వహించిన సాహసోపేతమైన విన్యాసాలు అబ్బురపరిచాయి. అనంతరం సోమ్ నాథ్ ఆలయ పునర్నిర్మాణానికి నాంది పలికిన సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత ఆలయ ప్రాంగణంలో జరిగే కుంభాభిషేక క్రతువులో ప్రధాని పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘ్వీ కూడా పాల్గొన్నారు.

అంతకుముందు ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన భారీ రోడ్‌షోకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. సోమనాథ్ వీధులు మోదీ నామస్మరణతో మారుమోగాయి. హెలిప్యాడ్ నుంచి వీర్ హమీర్జీ సర్కిల్ వరకు సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల మేర సాగిన ప్రధాని రోడ్‌షోకు జనం భారీగా తరలివచ్చారు. దారిపొడవునా జాతీయ జెండాలు ఊపుతూ, నినాదాలు చేస్తూ ప్రధానికి ఘనస్వాగతం పలికారు. ఈ రోడ్‌షోలో భారతీయ సంస్కృతి ప్రతిబింబించేలా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. బంగాల్‌కు చెందిన జానపద కళాకారులు తమ సంప్రదాయ నృత్యాలతో రోడ్‌షోలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 1951లో భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఈ పునర్నిర్మిత ఆలయాన్ని ప్రారంభించారు. ఆ చారిత్రక ఘట్టానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ అమృత్ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

# జులై 1 నుంచి వీబీజీ రామ్‌జీ పథకం అమలు

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం స్థానంలో కేంద్రం తీసుకొచ్చిన వీబీజీ రామ్‌జీ పథకం జులై ఒకటి నుంచి అమల్లోకి రానుంది. ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నోటిఫికేషన్ వెలువరించింది. జులై ఒకటి నుంచి అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో వీబీజీ రామ్‌జీ పథకం అమలవుతుందని పేర్కొంది. ఉపాధిహామీ పథకం స్థానంలో కొత్త పథకం వచ్చినప్పటికీ కూలీలకు ఎలాంటి అంతరాయం లేకుండా పని దినాలు లభిస్తాయని కేంద్రం స్పష్టం చేసింది. ఉపాధిహామీ కింద జారీచేసిన జాబ్ కార్డులు ఈ-కేవైసీ పూర్తయి ఉంటే కొత్త కార్డులు జారీచేసే వరకూ చెల్లుబాటు అవుతాయని తెలిపింది. ఒకవేళ ఈ-కేవైసీ పెండింగ్‌లో ఉన్నప్పటికీ కూలీలకు పని కల్పిస్తారని తేల్చిచెప్పింది. జాబ్ కార్డులు లేని వారికి గ్రామ పంచాయతీల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని వివరించింది. వీబీజీ రామ్‌జీ పథకం విధివిధానాలు, వేతన చెల్లింపులు, సమస్యల పరిష్కార వ్యవస్థకు సంబంధించిన మార్గదర్శకాలను త్వరలోనే జారీచేస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ తెలిపింది. ఈ విషయంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను సంప్రదించాల్సి ఉందని పేర్కొంది.



### 'గ్రామీణాభివృద్ధి నిర్మాణంలో చారిత్రాత్మక మార్పు'

మరోవైపు, వికసిత్ భారత్ 2047 దార్శనికతకు అనుగుణంగా, భారత గ్రామీణాభివృద్ధి నిర్మాణంలో ఇది ఒక చారిత్రాత్మక మార్పు అని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అభివర్ణించింది. ఈ పథకం ద్వారా జీవనోపాధి భద్రత, గ్రామీణ ఆదాయాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధిని బలోపేతం చేయడమే ఈ చట్టం లక్ష్యమని పేర్కొంది. ఇక, వేతన చెల్లింపుల్లోనూ స్పష్టమైన చర్యలకు ప్రాధాన్యం ఇస్తామని కేంద్రం స్పష్టం చేసింది. కార్మికుల బ్యాంక్ లేదా పోస్టాఫీస్ ఖాతాల్లోకి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలోనే వేతనాలు జమ చేస్తామని వెల్లడించింది. మస్టర్ రోల్ ముగిసిన 15 రోజుల్లోగా లేదా వారానికోసారి వేతనాలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. ఆలస్యం అయితే కార్మికులకు పరిహారం చెల్లించే నిబంధనలు కూడా ఉంటాయని పేర్కొంది.

### ఈ కొత్త చట్టంతో బెనిఫిట్స్ ఏంటి?

ఇదిలా ఉండగా, వీబీజీ రామ్?జీ కొత్త చట్టం ప్రకారం గ్రామీణ కుటుంబాలకు ఆర్థిక సంవత్సరానికి 125 రోజుల ఉపాధి హామీ కల్పించనున్నట్లు కేంద్రం ఇదివరకే పేర్కొంది. ప్రస్తుతం ఎంఎన్ఆర్ఈజీఏ కింద అమల్లో ఉన్న 100 రోజుల ఉపాధి హామీతో పోలిస్తే ఇది 25 రోజులు ఎక్కువ. గ్రామీణ జీవనోపాధి భద్రత, ఆదాయ వృద్ధి, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ చట్టం తోడ్పడుతుందని కేంద్రం చెబుతోంది. మరోవైపు, 2026-27 ఆర్థిక సంవత్సరానికి గ్రామీణ ఉపాధి కార్యక్రమాల కోసం రూ.95,692 కోట్లకు పైగా బడ్జెట్ కేటాయించామని కేంద్రం తెలిపింది. రాష్ట్రాల వాటా కలిపితే మొత్తం వ్యయం రూ.1.51 లక్షల కోట్లకు మించి ఉంటుందని అంచనా వేసింది. ఇది గ్రామీణ ఉపాధి రంగంలో ఇప్పటివరకు చేసిన అత్యధిక కేటాయింపులలో ఒకటని ప్రభుత్వం వెల్లడించింది.

### గ్రామీణ కార్మికుల హక్కులను బలహీనపరిచే ప్రయత్నం : కాంగ్రెస్

మరోవైపు, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కొత్త చట్టంపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఇది కేవలం ప్రచారానికే పరిమితమైన చర్య అని ఆరోపించింది. గ్రామీణ కార్మికుల హక్కులను బలహీనపరిచే ప్రయత్నమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శలు గుప్పించారు. కొత్త చట్టం గురించి ఇప్పటివరకు స్పష్టమైన కార్యాచరణ వివరాలు వెల్లడించలేదని పేర్కొన్నారు. జులై 1 నుంచి అమలు చేయాలంటే ఇప్పటికి అన్ని నిబంధనలు సిద్ధంగా ఉండాల్సిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలతో అర్థవంతమైన చర్చలు జరపకుండా కేవలం ప్రకటనలకే పరిమితం అవుతున్నారని ఆరోపించారు. ఈ చట్టం ఇచ్చే ఏకైక గ్యారంటీ అధిక కేంద్రీకరణ మాత్రమేనని ఆయన? వ్యాఖ్యానించారు. గ్రామీణ భారత కుటుంబాల ఉపాధి హక్కు, వేతన హక్కులను కేంద్రం దెబ్బతీస్తోందని ఆయన మండిపడ్డారు.

# ఇక వారానికి 48 గంటలే పని

కార్మిక, ఉద్యోగ వర్గాలకు శుభవార్త. వారానికి 48 గంటల పని పరిమితి, తప్పనిసరిగా వారానికొక విశ్రాంతి దినం, ఓవర్‌టైమ్ పనికి అదనపు చెల్లింపుపై కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్లను జారీచేసింది. దీంతో గతంలో నాలుగు కార్మిక కోడ్‌లలో చేసిన ఈ ప్రతిపాదనలు అధికారిక హోదాను పొందాయి. దేశవ్యాప్తంగా కంపెనీలు వీటిని ఇక కచ్చితంగా పాటించాల్సిందే. వాస్తవానికి నాలుగు కార్మిక కోడ్‌లు 2025 నవంబరు 21 నుంచే అమల్లోకి వచ్చాయి. అయితే మే 8, 9 తేదీల్లో వాటికి సంబంధించిన తుది నిబంధనలు, నియమాలతో కేంద్ర ప్రభుత్వం దాదాపు 30 అధికారిక గెజిట్‌లను ప్రచురించింది. దీంతో ఈ కార్మిక సంస్కరణల ప్రక్రియ పూర్తయింది.



### కనీస వేతనం లెక్కింపు సూత్రం తొలగింపు

కేంద్ర సర్కారు తాజాగా ప్రచురించిన గెజిట్ నోటిఫికేషన్లలోని అత్యంత కీలకమైన అంశం కార్మికుల కనీస వేతనం. కేంద్రం తొలుత విడుదల చేసిన నాలుగు కార్మిక కోడ్‌ల ముసాయిదాలో కనీస వేతనాన్ని ఎలా లెక్కించాలి అనే దానిపై స్పష్టమైన ఫార్ములాను, ప్రమాణాలను పేర్కొంది. కానీ, తాజాగా విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్లలోని తుది నిబంధనలలో ఆ లెక్కింపు సూత్రాన్ని ప్రభుత్వం తొలగించింది. దీనికి బదులుగా, కనీస వేతన ప్రమాణాలను భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక లేదా సాధారణ ఉత్తర్వు ద్వారా విడిగా ప్రకటిస్తుందని స్పష్టంచేసింది. కనీస జీవన ప్రమాణం, దుస్తులు, గృహవసతి వంటి వాటితో పాటు సముచితంగా భావించే ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకొని ఎప్పటికప్పుడు కనీస వేతనాన్ని నిర్ణయిస్తామని కేంద్ర ప్రభుత్వం కొత్త వేతన నిబంధనలు చెబుతున్నాయి.

### ఫ్లోర్ వేజ్‌ను ఇంకా ఖరారు చేయని కేంద్రం

కేంద్ర ప్రభుత్వం 29 పాత కార్మిక చట్టాలను రద్దు చేసి, తీసుకొచ్చిన నాలుగు కొత్త కార్మిక కోడ్‌లలో 'వేతనాల కోడ్ 2019' అనేది అత్యంత ముఖ్యమైన మొదటి కోడ్. ఈ వేతనాల కోడ్‌లోని సెక్షన్ 9 అనేది కేంద్ర ప్రభుత్వానికి జాతీయ స్థాయిలో 'ఫ్లోర్ వేజ్' (కనీస ప్రాథమిక వేతనం)ను నిర్ణయించే చట్టపరమైన అధికారాన్ని ఇస్తుంది. దీని ప్రకారం, దేశంలోని వివిధ భౌగోళిక ప్రాంతాలకు వేర్వేరు కనీస వేతనాలను కేంద్ర సర్కారు నిర్ణయించొచ్చు. కనీస ప్రాథమిక వేతనం (ఫ్లోర్ వేజ్) నిర్దిష్ట తుది మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం ఇంకా ఖరారు చేయలేదు. ఒక సెంట్రల్ అడ్వైజరీ బోర్డు, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపిన తర్వాతే దీనిపై తుది నిర్ణయాన్ని ప్రకటిస్తారని తెలుస్తోంది. కేంద్రం ఒకసారి ఫ్లోర్ వేజ్‌ను ప్రకటిస్తే, దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా తమ రాష్ట్ర కార్మికులకు అంతకంటే తక్కువ కనీస వేతనాన్ని నిర్ణయించడానికి వీలు ఉండదు. రాష్ట్రాలు తమ పరిధిలో కనీస వేతన చట్టాలను చేసేటప్పుడు కేంద్ర ఫ్లోర్ వేజ్‌ను ఒక ప్రాథమిక బెంచ్‌మార్క్‌గా కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది.

### కార్మిక సంఘాల వాదన ఇదీ

2700 క్యాలరీల ఆహారం, దుస్తులు, ఇల్లు, పిల్లల చదువుల ప్రాతిపదికన కార్మికుల కనీస వేతనాన్ని నిర్ణయిస్తామని నాలుగు కార్మిక కోడ్‌ల ముసాయిదాలో ప్రతిపాదించారు. అయితే ఈ లెక్కింపు సూత్రాన్ని, గెజిట్ నోటిఫికేషన్లలోని తుది నియమాల నుంచి తొలగించడాన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కనీస వేతనానికి కచ్చితమైన ఫార్ములా అనేది లేకపోతే భవిష్యత్తులో ప్రభుత్వాలు కార్మికుల వాస్తవ ఖర్చులను పట్టించుకోకుండా, ఏకపక్షంగా తక్కువ వేతనాన్ని నిర్ణయించే ముప్పు ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఒకే రకమైన శ్రమకు ఒకే విధమైన కనీస వేతనం ఉండాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. భౌగోళిక ప్రాంతాల ఆధారంగా వేర్వేరు ఫ్లోర్ వేజ్‌లను నిర్ణయిస్తే, అది వెనుకబడిన రాష్ట్రాల కార్మికులను మరింత పేదరికంలోకి నెట్టడమే అవుతుందని వాదిస్తున్నాయి.

## ఎంకే స్టాలిన్‌తో తమిళనాడు సీఎం విజయ్ భేటీ

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌ను ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ తర్వాత ఆయన వివిధ పార్టీల నేతలతోనూ మర్యాదపూర్వంగా కలిసి, వారితో మాట్లాడారు. తమిళనాడు 17వ అసెంబ్లీ తొలి సమావేశాలు ఈ రోజు అంటే మే 11న ప్రారంభమయ్యాయి. నూతనంగా ఎన్నికైన శాసనసభ్యులు ఈ రోజు ప్రమాణ స్వీకారం చేశారు. అసెంబ్లీ మొదటి రోజు సమావేశాలు ముగిసిన తర్వాత, సీఎం విజయ్?, మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ ఇంటికి వెళ్లారు. ఆయనకు డీఎంకే శాసనసభ కమిటీ అధ్యక్షుడు ఉదయనిధి స్టాలిన్ స్వాగతం పలికారు. స్టాలిన్ పుష్పగుచ్ఛం ఇచ్చి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం విజయ్, స్టాలిన్‌కు శాలువా కప్పి సత్కరించారు. వారితో కొద్దిసేపు మాట్లాడిన తర్వాత సీఎం విజయ్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ భేటీపై స్టాలిన్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన గౌరవనీయులు విజయ్, నన్ను కలిసి, నాకు గ్రీట్ చేశారు. నేను కూడా వారికి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేశాను. సలహాలు ఇచ్చాను" అని పేర్కొన్నారు.

### అన్ని పార్టీల నేతలను కలుస్తున్న విజయ్!

ఆ తర్వాత విజయ్, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైకోను కలిశారు. ప్రభుత్వ ఏర్పాటులో తనకు మద్దతు తెలిపినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఆ తరువాత వైకో మాట్లాడుతూ, "తమిళనాడులో రాజకీయ పరిస్థితి మారిందని నేటి సంఘటనలు స్పష్టంగా చూపిస్తున్నాయి. వివిధ పార్టీల నేతల ఇళ్లకు వెళ్లి, వారిని కలవడం ముఖ్యమంత్రి విజయ్ ఉదారతను, రాజకీయ పరిపక్వతను తెలియజేస్తోంది. ఇది తమిళనాట ఆరోగ్యకరమైన రాజకీయాలను అభివృద్ధి చేయాలనే ఆయన ఉద్దేశాన్ని తెలియజేస్తోంది. విజయ్ సంస్కారం నన్ను ఆశ్చర్యపరిచింది. ఆయన నన్ను కలిసినప్పుడు, నా ప్రసంగాలను అభిమానినని చెప్పాడు. అయితే నేను విజయ్‌కు ఎలాంటి సలహాలు ఇవ్వలేదు. కేవలం ఆయనను అభినందించాను. నిజానికి ఆయన బీజేపీని తమిళనాడు నుంచి తరిమివేశారు. విజయ్ అన్నా శైలిలో వ్యవహరిస్తున్నారు. 1967లో డీఎంకే గెలిచి అధికారంలోకి వచ్చినప్పుడు, అన్నా ప్రతిపక్ష నేతలందరినీ కలిశారు. ఇప్పుడు విజయ్ కూడా అదే శైలిలో వ్యవహరిస్తున్నారు" అని అన్నారు.

### సీమన్, అన్బుమణితో భేటీ

తర్వాత చెన్నైలో నీలన్‌కరైలో ఉన్న నామ్ తమిళర్ కచ్చి (ఎన్‌టీపీ) ప్రధాన సమన్వయకర్త సీమన్ నివాసానికి విజయ్ వెళ్లారు. ఆయనను సాదరంగా ఆహ్వానించిన సీమన్ శాలువ కప్పి సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పీఎంకే నేత అన్బుమణి రామదాస్ ఇంటికి విజయ్ స్వయంగా వెళ్లి కలిశారు. అన్బుమణి భార్య, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి, ఫొటో దిగారు. ఇక మంగళవారం ఆయన వీసీకే నేత తరుమావళవన్‌ను కూడా కలవనున్నట్లు తెలుస్తోంది.

### చరిత్ర సృష్టించిన విజయ్

మే 4న విడుదలైన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ 108 స్థానాలు గెలుచుకొని అతిపెద్ద పార్టీగా అవతరించింది. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు, వీసీకే, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ వంటి పలు పార్టీల శాసన సభ్యుల మద్దతు ఇవ్వడంతో ఆయనను ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు గవర్నర్ ఆర్లేకర్ ఆహ్వానించారు. దీనితో టీవీకే నేత విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం చెన్నైలోని నెహ్రూ ఇండిరో స్టేడియంలో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతోపాటు 9 మంది మంత్రులు కూడా ప్రమాణస్వీకారం చేసినవారిలో ఉన్నారు. కాగా, 17వ శాసనసభ తొలి సమావేశాలు ఈ రోజు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యాయి. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ ముఖ్యమంత్రులు పళనిస్వామి, పన్నీర్ సెల్వం కూడా ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేశారు. తమిళనాడు అసెంబ్లీలో ప్రస్తుతం సభ్యుల సంఖ్య 233గా ఉంది. ముఖ్యమంత్రి విజయ్ తిరుచ్చి ఈస్ట్ ఎమ్మెల్యే స్థానానికి రాజీనామా చేశారు. దీంతో ఒక స్థానం ఖాళీగా ఉంది. కాగా, మంగళవారం (మే 12) స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. మే 13న ముఖ్యమంత్రి విజయ్? శాసన సభలో తన ప్రభుత్వ మెజారిటీని నిరూపించుకోవాల్సి ఉంటుంది.

## విదేశీ మారక వ్యయాన్ని తగ్గించాలి



పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడానికి దేశ పౌరులకు ప్రధాని నరేంద్ర మోదీ చేసిన విజ్ఞప్తులకు మద్దతుగా కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి సమయంలో దేశ ప్రజలు, వ్యాపార సంస్థలు విదేశీ మారక ద్రవ్య వినియోగాన్ని తగ్గించాలని పిలుపునిచ్చారు. అదే సమయంలో దేశానికి మరింత విదేశీ మారక ద్రవ్యాన్ని సంపాదించే దిశగా కృషి చేయాలని సూచించారు. దిల్లీలో జరిగిన సీఐఐ వార్షిక బిజినెస్ సమ్మిట్?-2026లో ప్రసంగిస్తూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'యుద్ధం ఇంకా కొనసాగుతోంది. ఆదివారం జరిగిన పరిణామాలను చూస్తే కూడా కాల్పుల విరమణ ఇప్పటికీ చాలా దూరంలో ఉందని మనందరికీ అర్థమవుతోంది. మన ప్రధానంత్రి మనందరినీ కోరినట్లుగా పౌరులుగా మనం విదేశీ మారకద్రవ్యం అవసరమయ్యే అన్ని విషయాలపై మన ఖర్చును తగ్గించుకోవచ్చు. పౌరులుగా మన జీవితాల్లో విదేశీ మారక ద్రవ్య వినియోగాన్ని తగ్గించేందుకు ఏం చేయగలమో గుర్తించాలి. విదేశీ మారకాన్ని ఆదా చేయడం చాలా ముఖ్యం' అని అశ్విని వైష్ణవ్ తెలిపారు.

### 'ఆదాతో పాటు సంపాదన కూడా ముఖ్యమే'

కేవలం ఆదా చేస్తే సరిపోదని, ఎగుమతులు, సేవలు, వ్యాపారాల ద్వారా మరింతగా సంపాదించాల్సిన అవసరం ఉందని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. రెండు పనులు సమాంతరంగా జరగాలని తెలిపారు. ఒకవైపు ఖర్చును తగ్గించి, మరోవైపు దేశానికి మరింత విదేశీ మారక ద్రవ్యాన్ని తీసుకురావాలని చెప్పారు. ప్రధాని మోదీ చేసిన పిలుపును పునరుద్ఘాటిస్తూ, వ్యాపార వర్గాలు, పౌరులు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని అశ్విని వైష్ణవ్ కోరారు. మీ సంస్థల్లో, వ్యాపారాల్లో, మీ సామర్థ్యానికి తగ్గట్టుగా దేశానికి ఉపయోగపడే విధంగా సాధ్యమైనంత చేయండి అని పిలుపునిచ్చారు.

### రాహుల్‌పై బీజేపీ ఘాటు వ్యాఖ్యలు

ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ విజ్ఞప్తిపై రాహుల్ గాంధీ చేసిన విమర్శలకు బీజేపీ ఘాటుగా ప్రతిస్పందించింది. కాంగ్రెస్ రాజకీయాలు దేశ నిర్మాణం కోసం కాకుండా కేవలం అధికార రాజకీయాలకే పరిమితమయ్యాయని బీజేపీ ఐటీ విభాగం అధిపతి అమిత్ మాలవీయా ఆరోపించారు. ప్రజలను మోదీ త్యాగాలు చేయమని అడగలేదని, దేశ ప్రయోజనాల దృష్ట్యా జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాలని మాత్రమే కోరారని చెప్పారు. సవాళ్లను ఎదుర్కోవడంలో ప్రజల భాగస్వామ్యాన్ని కోరడం, నిజ పరిస్థితులను ప్రజలకు తెలియజేయడమే బాధ్యతాయుత నాయకత్వమని మాలవీయ అన్నారు.

### 'దేశ ప్రయోజనాల కోసమే పిలుపు'

'ఇంధనాన్ని ఆదా చేయడం, స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం, విదేసీ మారక ద్రవ్యాన్ని కాపాడటం, ఆత్మనిర్భరతను బలోపేతం చేయడం వంటి అంశాలపై ప్రధాని పిలుపునిచ్చారు. జాతీయ ప్రయోజనాల కోసం ప్రజా భాగస్వామ్యాన్ని కోరడం కాంగ్రెస్‌కు ఉపదేశంలా కనిపిస్తోంది. ఎందుకంటే వారి రాజకీయాలు దేశ నిర్మాణం కోసం కాదు, అధికారాన్ని కాపాడుకోవడానికే పరిమితమయ్యాయి. ప్రజలను బాధ్యతగా వ్యవహరించాలని కోరడం వైఫల్యమైతే, మీకు ఇష్టమైన నెహ్రూ కూడా కాంప్రమైజ్డ్ ప్రధానినా? ఇతర దేశాల్లో యుద్ధాలు జరిగితే ద్రవ్యోల్బణ రూపంలో భారత్‌పై ప్రభావం పడుతుందని నెహ్రూ స్వయంగా చెప్పారు. అప్పుడు అది కూడా సాకేనా? లేక బాధ్యతాయుత నాయకత్వమా?' అని మాలవీయా ప్రశ్నించారు. దీనికి సంబంధించి నెహ్రూ చేసిన పాత ప్రసంగ వీడియోను కూడా మాలవీయ షేర్ చేశారు. అందులో కొరియా లేదా అమెరికా వంటి దేశాల్లో యుద్ధాలు జరిగితే భారత్‌పై ప్రభావం పడుతుందని నెహ్రూ చెప్పినట్లు పేర్కొన్నారు.




# ముంబైలో గ్రాండ్‌గా 'పెద్ది' ట్రైలర్ లాంచ్.. పాన్ ఇండియా మార్కెట్‌పై భారీ ఫోకస్!

టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్న పెద్ది సినిమా ఇప్పుడు మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే పోస్టర్లు, గ్లింప్స్‌తో భారీ హైప్ తెచ్చుకున్న ఈ చిత్రం ట్రైలర్‌ను ముంబైలో గ్రాండ్ ఈవెంట్ ద్వారా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేసారు.మే 18న ముంబైలో జరగబోయే ఈవెంట్ ద్వారా ట్రైలర్ విడుదల చేస్తున్నట్టు అఫీషియల్ పోస్టర్ ద్వారా తెలియజేశారు. తెలుగు రాష్ట్రాలతో పాటు హిందీ మార్కెట్‌పై కూడా భారీ స్థాయిలో ఫోకస్ పెట్టిన చిత్ర బృందం, ట్రైలర్ లాంచ్‌ను బాలీవుడ్ మీడియా సమక్షంలో నిర్వహించేందుకు సిద్ధమవడం చర్యనీయాంశం అయింది. ప్రస్తుతం పాన్ ఇండియా సినిమాలకు ముంబై ప్రధాన ప్రమోషనల్ హబ్‌గా మారిన నేపథ్యంలో 'పెద్ది' టీమ్ కూడా అదే స్ట్రాటజీని ఫాలో అవుతోందని తెలుస్తోంది. ఈ ట్రైలర్ ఈవెంట్‌కు చిత్ర యూనిట్‌తో పాటు పలువురు బాలీవుడ్ ప్రముఖులు కూడా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా హిందీ బెల్ట్‌లో సినిమాపై బజ్ పెంచేందుకు ప్రత్యేకంగా మీడియా ఇంటరాక్షన్స్, ఫ్యాన్స్ ఈవెంట్స్ కూడా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. సినిమాలో హీరో పాత్రను ఇప్పటివరకు ఎప్పుడూ చూడని మాస్ అవతార్‌లో చూపించబోతున్నారనే ప్రచారం ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తి పెంచింది. గ్రామీణ నేపథ్యంతో పాటు భారీ యాక్షన్ ఎలిమెంట్స్, భావోద్వేగ కథాంశం ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలుస్తాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే షూటింగ్ చివరి దశకు చేరుకున్న ఈ సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా సాగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ట్రైలర్ కోసం ప్రత్యేకంగా హై వోల్టేజ్ యాక్షన్ షాట్స్, ఎమోషనల్ డైలాగ్స్‌ను కట్ చేస్తున్నారని సమాచారం. ముంబైలో ట్రైలర్ లాంచ్ నిర్వహించడం వెనుక మరో ముఖ్య కారణం హిందీ మార్కెట్‌లో భారీ ఓపెనింగ్స్ సాధించాలనే లక్ష్యమేనని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇటీవల దక్షిణాది సినిమాలకు ఉత్తరాదిలో పెరుగుతున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని మేకర్స్ భారీ ప్రమోషన్ ప్లాన్ రూపొందించినట్లు తెలుస్తోంది. ఇక సోషల్ మీడియాలో కూడా 'పెద్ది'పై ఇప్పటికే భారీ చర్చ జరుగుతోంది. ట్రైలర్ విడుదల తర్వాత సినిమాపై అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. మొత్తానికి ముంబై వేదికగా జరగనున్న 'పెద్ది' ట్రైలర్ లాంచ్ ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో మరింత బలంగా నిలబెట్టే ఈవెంట్‌గా మారనుందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.






# ప్రియాంకా చోప్రా వారణాసి షూటింగ్ అప్‌డేట్..!

ఎస్ఎస్ రాజమౌళి -మహేశ్ బాబు కాంబోలో రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ వారణాసి బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తుండగా.. మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్వీరాజ్ సుకుమార్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. మైథాలజీ, సైన్స్ ఫిక్షన్ జోనర్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రానికి సంబంధించి ఏదో ఒక ఆసక్తికర అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించిన కీ అప్‌డేట్‌ను ప్రియాంకా చోప్రా సోషల్ మీడియా ద్వారా షేర్ చేసుకుంది. జర్నీలో ఉన్న ప్రియాంకా చోప్రా 'వారణాసి బయలుదేరుదాం'అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టింది. తాజా పోస్ట్‌తో ప్రియాంకా చోప్రా వారణాసి తాజా షెడ్యూల్‌లో జాయిన్ అయినట్టు అర్థమవుతోంది. షూటింగ్‌కు అవసరమైన నీటి కొరత కారణంగా ఇటీవలే వారణాసి చిత్రీకరణ నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రియాంకా చోప్రా పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఈ మూవీలో మాధవన్, ప్రకాశ్ రాజ్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం రెండు పార్టులుగా రాబోతుంది. ఈ మూవీని 2027, 2029లలో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నట్టు వార్తలు వస్తుండగా జక్కన్న టీం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.



# ఆరు నెలలు నరకం చూశా.. కంట్రోల్ చేసుకోలేక ఏడ్చేదాన్ని - కియారా అద్వానీ

తల్లి అయిన తర్వాత తన జీవితం పూర్తిగా మారిపోయింది అంటుంది బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ. తాజాగా ఆమె ప్రముఖ పాడ్‌కాస్ట్ హోస్ట్ రాజ్ షమానికి ఇంటర్వ్యూ ఇచ్చింది. ఈ సందర్భగా పోస్ట్‌పార్టమ్ (ప్రసవం తర్వాత తల్లి శరీరం, మానసిక స్థితిలో వచ్చే మార్పు) గురించి మాట్లాడుతూ.. ఎమోషనల్ అయింది. 'పాప పుట్టిన తర్వాత మొదటి ఆరు నెలలు నరకం చూశా. నాపై నాకే జాలి చూపించుకోవడం కష్టంగా అనిపించింది. చిన్న చిన్న విషయాలకే ఏడ్చేదాన్ని. నా భావోద్వేగాలను కంట్రోల్ చేసుకోలేకపోయేదాన్ని. నా మనసులోని భావాలను స్పష్టంగా అర్థం చేసుకోవడానికి, వాటికి ప్రాధాన్యత ఇవ్వడానికి సుమారు ఆరు నెలల సమయం పట్టింది. ఇంతకాలం కుటుంబం, పని, ఇతరుల గురించి మాత్రమే ఆలోచించిన నేను.. నా కోసం కూడా సమయం కేటాయించుకోవాల్సిన అవసరం ఉందన్న విషయం మాతృత్వం నేర్పింది. ఈ కష్ట సమయంలో నా భర్త సిద్ధార్థ్ మల్హోత్రా చాలా సపోర్ట్ చేశాడు. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా.. ప్రతి రోజు రాత్రి నా దగ్గరకే వచ్చేవాడు. డ్రైవ్‌కి తీసుకెళ్లేవాడు. ఆ చిన్న డ్రైవ్స్ కూడా నాకు ఎంతో మానసిక ప్రశాంతతను కలిగించేవి' అంటూ కియారా ఎమోషనల్ అయింది. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి.

# రూ.25 లక్షల ఆఫర్.. ఫామ్‌హౌస్‌కు రమ్మన్నారు.. కానీ

బిగ్‌బాస్ షోతో ఫేమస్ అయిన టాలీవుడ్ బ్యూటీ కిర్రాక్ సీత. బిగ్‌బాస్ సీజన్-8 కంటెస్టెంట్‌గా అభిమానులను మెప్పించింది. మొదట యూట్యూబర్‌గా కెరీర్ ప్రారంభించిన సీత 7 ఆర్ట్స్ సరయుతో కలిసి చాలా వీడియోలు చేసింది. అంతే కాకుండా బేబీ మూవీలో హీరోయిన్ పక్కన ఆకట్టుకుంది. ఈ సినిమాలో హీరోయిన్ ఫ్రెండ్‌గా నెగిటివ్ రోల్‌లో అద్భుతంగా నటించింది. బిగ్‌బాస్ షో మరింత ఫేమ్ తెచ్చుకుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన ఈ ముద్దుగుమ్మ తనకెదురైన అనుభవాలను పంచుకుంది. కెరీర్ ప్రారంభంలో తనకు ఎదురైన క్యాస్టింగ్ కౌచ్ అనుభవాన్ని బయట పెట్టింది. ఓ సారి సినిమా ఛాన్స్ అని కాల్ చేసి అడిగారని తెలిపింది. 7 ఆర్ట్స్‌లో చేసే సమయంలోనే సినిమా ఛాన్స్ ఉందని ఫోన్ చేసి చెప్పారని గుర్తు చేసుకుంది. అయితే ఫామ్ హౌస్‌కి రావాలిని పిలిచారని తెలిపింది. మొదట సరే అన్నా.. కానీ నేను వెళ్లలేదు.. మళ్లీ రెండు రోజుల తర్వాత కాల్ చేసి అడిగారని పేర్కొంది. ఇక్కడికి వస్తే మీకు రూ.25 లక్షలు ఇస్తారని చెబితే నేను సున్నితంగా తిరస్కరించానని సీత వెల్లడించింది. కొంతమంది ఇలా నంబర్ దొరికితే చాలు కాల్ చేస్తుంటారని కిర్రాక్ సీత తెలిపింది. కేవలం టైమ్‌పాస్‌కు కూడా ఇలా కాల్స్ చేస్తారని వివరించింది. ఎలా ఉంటది అని నేను అడుగుతా.. ఇండస్ట్రీ గురించి మీకు తెలుసు కదా?? అని అంటారని పేర్కొంది. అప్పుడు నేను వెంటనే ఇలా అడగడానికి మీకు సిగ్గుందా? అని వెంటనే ఇచ్చిపడేస్తానని సీత వెల్లడించింది. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.





# ఎర్రమందారంగా డస్కీ బ్యూటీ డింపుల్

ఈ ఏడాది ఇప్పటికే రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చిన శర్వానంద్.. త్వరలో 'భోగి'తో రాబోతున్నాడు. విలేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా దీన్ని తెరకెక్కిస్తున్నారు. సంపత్ నంది దర్శకుడు. ఆగస్టు 28న థియేటర్లలోకి రాబోతున్న ఈ చిత్రం నుంచి ఇప్పుడు డింపుల్ హయాతి ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ఇప్పటికే హీరోహీరోయిన్లు అయిన శర్వానంద్, అనుపమ పరమేశ్వరన్ లుక్స్ రిలీజ్ చేశారు. తాజాగా మందారం అనే పాత్రలో డింపుల్ హయాతి లుక్ రిలీజ్ చేశారు. ఇందులో ఎర్రచీరలో డిఫరెంట్‌గా కనిపించింది. ఈ ఏడాది సంక్రాంతికి 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'లో ఓ హీరోయిన్‌గా చేసినప్పటికీ హిట్ అయితే దక్కలేదు. కెరీర్ ప్రారంభం నుంచి హీరోయిన్‌గా పలు సినిమాలు చేస్తున్న డింపుల్ హయాతికి సరైన సక్సెస్ రావట్లేదు. మరి 'భోగి'లో మందారం పాత్ర అయినా దాన్ని తీసుకొస్తుందేమో చూడాలి?